

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

## కంగారూల గడ్డపై తెలుగోడి సత్తా



సెంచరీతో చెలరేగిన నితీష్ 

15

# 190 కొత్త 108 వాహనాలు

- కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- ఇకపై 108, 104 సేవలకు సింగిల్ సర్వీస్ ప్రొవైడర్
- 108 అంబులెన్స్ డ్రైవర్లకు అదనంగా రూ.4వేలు
- అందుబాటులోకి కొత్తగా 58 మహాప్రస్థానం వాహనాలు
- నాణ్యమైన వైద్యం కోసం ఇన్సూరెన్స్ పద్ధతిలో ఎన్టీఆర్ వైద్యసేవ
- ప్రతి మండలంలో జన ఔషధి స్టోర్స్ ఏర్పాటు
- ప్రివెంటివ్ హెల్త్ కేర్‌కు ప్రాధాన్యమిచ్చేలా ప్రణాళికలు
- వైద్య ఆరోగ్య శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష

2





## నితీష్ సెంచరీపై సీఎం చంద్రబాబు అభినందన

3

## తెలుగు నేల పులకిస్తోంది

ప్రపంచ తెలుగు రచయితల మహాసభల నిర్వహణపై సీఎం చంద్రబాబు ట్వీట్

3



### రాజ్యాంగ రచనలో

## తెలుగోడి పాత్ర చిరస్మరణీయం

- ప్రముఖుల చిత్రాలు, చరిత్రతో వినూత్నంగా అసెంబ్లీ క్యాలెండర్
- ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

3

### మంత్రి లోకేష్ సాయం..

## స్వస్థలానికి అభాగ్యురాలు

- కువైట్‌లో చిక్కుకున్న తిరుపతి జిల్లా వాసి
- యజమాని చేతుల్లో చిత్రహింసలు
- ఆదుకోవాలని ఎక్స్‌లో వేడుకోలు
- స్పందించి స్వస్థలానికి చేర్చిన మంత్రి లోకేష్

4



## నితీష్.. నీ ఆట చూసి గర్విస్తున్నా

- ప్రపంచానికి తెలుగువారి ప్రతిష్ట చాటిచెప్పావు
- సెంచరీ వీరుడికి మంత్రి లోకేష్ అభినందనలు

3

## మన్మోహన్ అరుదైన రాజనీతిజ్ఞుడు

- ఆయన విశాల హృదయానికి మా కుటుంబం రుణపడి ఉంటుంది : మంత్రి లోకేష్ నివాళి

4

## రావులపాలెంలో వైసీపీ నేతల భూకబ్జా

- మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మేనమామ, మాజీ సర్పంచ్ నిర్వాకం
- విచారణ జరిపించాలని ప్రజావినతుల్లో ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించిన మంత్రి ఆనం, పల్లా శ్రీనివాసరావు

7

## బొత్స కుటుంబపాలనకు చరమగీతం

- ఉత్తరాంధ్రను అన్నివిధాలా దోచుకుతిన్నారు
- సంస్కారంతో నమస్కారం పెడితే దుష్ప్రచారమా?
- నీలిమీడియా ప్రచారంలో నిజం లేదు
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ధ్వజం

4

## వైసీపీ నేతల అహంకారం అణిచేస్తాం

- ఉప ముఖ్యమంత్రి పవన్ హెచ్చరిక
- ఎంపీడీవోపై దాడి రాష్ట్ర యంత్రాంగంపై జరిగిన దాడిగా భావిస్తాం
- నిందితులను కఠినంగా శిక్షిస్తాం
- అధికారులకు అండగా ఉంటాం
- 11 సీట్లకు పరిమితం చేసినా వైసీపీ నేతకు బుద్ధి రాలేదు
- వైసీపీ నాయకుడు సుదర్శన్ రెడ్డి దాడిలో గాయపడ్డ ఎంపీడీవోకు పరామర్శ
- అధైర్యపడొద్దని కుటుంబ సభ్యులకు భరోసా

5



### గాలివీడు ఎంపీడీవోపై దాడి..

## వైసీపీ నేతల బరితెగింపునకు పరాకాష్ట

- బాధ్యులను కఠినంగా శిక్షిస్తాం
- హోంమంత్రి అనిత స్పష్టీకరణ
- గాయపడిన ఎంపీడీవోకు ఫోన్‌లో పరామర్శ

5



## జగన్‌రెడ్డీ..ఆపు నీ డ్రామాలు

- ప్రజలపై విద్యుత్ భారాలు మోపి నేడు ధర్నాలా?
- మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజం

6



చైతన్యరథం

# 190 కొత్త 108 వాహనాలు

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో అందరికీ మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వైద్య ఆరోగ్య శాఖను మళ్లీ గాడిన పెట్టి.... పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా పలు కీలక ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపారు. ఉండవల్లిలోని తన నివాసంలో వైద్య ఆరోగ్య శాఖపై శనివారం సీఎం సమీక్ష నిర్వహించారు. వైద్యశాఖలో పేరుకుపోయిన సమస్యలు, తీసుకురానున్న సంస్కరణలపై చర్చించారు. ప్రివెంటివ్ హెల్త్ కేర్‌పై వైద్య ఆరోగ్య శాఖ దృష్టిపెట్టాలని సీఎం సూచించారు. 104 సర్వీసుల ద్వారా రక్త పరీక్షలు సహా పలు టెస్టులు చేసి ప్రజల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకునే విధానాన్ని పైలెట్‌గా ప్రారంభించాలని సీఎం నిర్ణయించారు. ప్రజల హెల్త్ రిపోర్టులు రూపొందించడం, ప్రభుత్వపరంగా ఆరోగ్య పరీక్షలు చేసి హెల్త్ కార్డ్ ఇచ్చే విధానాలను అమలు చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని సీఎం అన్నారు. సమస్య ఉన్న ప్రతి ఒక్కరూ ఆసుపత్రికి వచ్చే అవసరం లేకుండా... సాంకేతికత ద్వారా వైద్య సాయం పొందే పరిస్థితి తీసుకురావాలని సీఎం సూచించారు. వైద్యంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సేవను సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళికలు రచించాలని సీఎం సూచించారు.

### కొత్త అంబులెన్స్‌ల కొనుగోలుకు నిర్ణయం

ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం, 108, 104 సేవలు, ఎన్టీఆర్ వైద్య సేవను బీమా విధానంలో తీసుకువచ్చి నాణ్యమైన వైద్యసేవలు అందించే విషయంపైనా అధికారులతో సీఎం చర్చించారు. నాటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 108, 104 సర్వీసులకు విడివిడిగా ఆపరేటర్లు ఉండేవారు. 2020 తరువాత కాల్‌సెంటర్‌తో కలిపి ముగ్గురు ఆపరేటర్ల ద్వారా సేవలు అందించారు. ప్రభుత్వం నేడు మళ్లీ కొత్తగా టెండర్లకు వెళ్లనున్న నేపథ్యంలో సింగిల్ ఆపరేటర్ ద్వారా మూడు సేవలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న 108 సర్వీసులు అందిస్తున్న 190 అంబులెన్స్‌లు ఫిట్‌నెస్ కోల్పోయాయి. 2016లో కొనుగోలు చేసిన వీటిని మార్చాల్సి ఉంది. ఇందులో 54 వాహనాలు 5 లక్షల కి.మీ కంటే ఎక్కువ తిరిగి ఉండగా..... 65 వాహనాలు 4 లక్షల కి.మీపైగా తిరిగాయి. 71 వాహనాలు 2.5 నుంచి 4 లక్షల కి.మీ తిరిగాయి. వీటన్నింటినీ పూర్తిగా మార్చి కొత్తవాహనాలు కొనుగోలు చేయాలనే ప్రతిపాదనకు సీఎం అంగీకారం తెలిపారు. వీటికోసం రూ.60 కోట్లు ఖర్చవుతుంది. 104 సర్వీసుల్లో గతంలో ల్యాబ్ టెక్నిషియన్ ఉండేవారు. మైక్రోస్కోప్, స్క్రీనింగ్ పరీక్షలు చేసేవాళ్లు. రాపిడ్ డయాగ్నోస్టిక్ కిట్స్ అందుబాటులో ఉండేవి. గత ప్రభుత్వం వీటిని నిర్వీర్యం చేసింది. గ్రామాల్లో వైద్య సేవలు అందించడంలో కీలకమైన 104 అంబులెన్స్‌లను బలోపేతం చేసేందుకు ల్యాబ్ టెక్నిషియన్ ఏర్పాటు చేయడంతో పాటు పలు రకాల టెస్టులు చేసే సౌలభ్యాన్ని మళ్లీ తీసుకురానున్నారు.



- కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- ఇకపై 108, 104 సేవలకు సింగిల్ సర్వీస్ ప్రొవైడర్
- 108 అంబులెన్స్ డ్రైవర్లకు అదనంగా రూ.4వేలు
- అందుబాటులోకి కొత్తగా 58 మహాప్రస్థానం వాహనాలు
- నాణ్యమైన వైద్యం కోసం ఇన్సూరెన్స్ పద్ధతిలో ఎన్టీఆర్ వైద్యసేవ
- ప్రతి మండలంలో జన ఔషధి స్టోర్స్ ఏర్పాటు
- ప్రివెంటివ్ హెల్త్ కేర్‌కు ప్రాధాన్యమిచ్చేలా ప్రణాళికలు
- వైద్య ఆరోగ్య శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష

### 108 సిబ్బందికి అదనంగా రూ.4 వేలు

108 సర్వీసులో సిబ్బంది, డ్రైవర్ 12 గంటలపాటు డ్యూటీలో ఉంటారని... వీరికి జీతంతో కలిపి అందనంగా రూ.4 వేలు చెల్లించేవారు. అయితే గత ప్రభుత్వం రూ.2 వేలు మాత్రమే ఇచ్చింది. దీన్ని తిరిగి పెంచి.... గతంలో ఇచ్చినట్లు ఇకపై జీతానికి అదనంగా రూ.4 వేలు ఇవ్వాలని సీఎం నిర్ణయించారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఆసుపత్రుల్లో చనిపోయిన వారి మృతదేహాలు తరలించేందుకు మహాప్రస్థానం వాహనాలను ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుతం వాటి సంఖ్య పెంచాల్సి ఉందని అధికారులు తెలపగా సీఎం దానికి కూడా అంగీకరించారు. ఇందులో భాగంగా 58 మహాప్రస్థానం వాహనాలను సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా అందుబాటులోకి తేనున్నారు. దీనికి యేడాదికి రూ.9.45 కోట్లు అదనంగా ఖర్చు అవనుంది. ఆసుపత్రుల వద్ద అంబులెన్స్ మాఫియా వంటి ముఠాల ఆగడాలు సాగడానికి వీల్లేదని సీఎం అధికారులకు స్పష్టంచేశారు. ఆత్మీయులను కోల్పోయి బాధల్లో ఉన్న ప్రజలను పీల్చుకుతినే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనిసీఎం సూచించారు.

### ఆరోగ్య బీమాతో నాణ్యమైన వైద్య సేవలు

ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా 1.43 కోట్ల కుటుంబాలకు చెందిన 4.3 కోట్లమందికి ఉచిత వైద్య సేవలు అందుతున్నాయి. ఎన్టీఆర్ వైద్య సేవలో 3,257 రకాల జబ్బులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల మేర హెల్త్ కవరేజ్ ఉంటుంది. ట్రస్ట్ పద్ధతిలో ప్రస్తుతం ఎన్టీఆర్ వైద్య సేవ కార్యక్రమం నిర్వహిస్తుండగా... ఈ కార్యక్రమాన్ని బీమా విధానంలో తీసుకొచ్చే అంశంపై చర్చించారు. ఆరోగ్య బీమా విధానం వల్ల మరింత మెరుగ్గా, నాణ్యమైన సేవలు అందించే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. రాష్ట్రాన్ని రెండు యూనిట్లుగా విభజించి బీమా విధానాన్ని ప్రారంభిచనున్నారు. పబ్లిక్ సెక్టార్, ప్రైవేటు సెక్టార్‌లో ఉన్న బీమా కంపెనీల ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఉద్యోగులు తప్ప ప్రస్తుతం ఎన్టీఆర్ వైద్య సేవ లబ్దిదారులు అందరికీ ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. ఇతర రాష్ట్రాల్లో ఉన్న విధానాలను కూడా పరిశీలించి అధికారులు చేసిన ప్రతిపాదనలకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. అదేవిధంగా జన్ ఔషధి మందుల షాపులను ప్రతి మండలంలో ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్‌కు తితిదే ఉద్యోగులు, పెన్షనర్ల భారీ విరాళం

అమరావతి (చైతన్య రథం): వరద బాధితుల సహాయార్ధం తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగులు, పెన్షనర్లు ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళం అందిచారు. సీఎం చంద్రబాబు నాయుడుని ఉండవల్లి నివాసంలో శనివారం కలిసి ఉద్యోగుల తరపున రూ.1,18,36,798, పెన్షనర్ల తరపున రూ.71.59 లక్షల చెక్కును విరాళంగా అందించారు. వీరిని సీఎం అభినందించారు. అంతకముందు టీటీడీ అర్చకులు సీఎం చంద్రబాబును ఆశీర్వదించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## అచ్చుగుద్దినట్లు చంద్రబాబులా..

- పెళ్లి వేడుకలో అలరించిన మిమిక్రీ కళాకారుడు
- వైరల్ వీడియో షేర్ చేసిన మంత్రి లోకేష్
- తాను ఆ వ్యక్తికి అభిమానినయ్యానని వ్యాఖ్య





అమరావతి (చైతన్యరథం): సోషల్ మీడియాలో వైరలయ్యే వీడియోలు ప్రముఖులను ఆకర్షిస్తుంటాయి. తాజాగా ఏపీ సీఎం చంద్రబాబుని ఇమిటేట్ చేసిన ఓ వ్యక్తి వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయిన విషయం తెలిసిందే. ఈ వీడియో మంత్రి లోకేష్ వరకూ చేరింది. ఆయన దీన్ని ఎక్స్‌లో షేర్ చేశారు. 'నేను ఇతడికి అభిమానిగా మారిపోయాను. చంద్రబాబులా మాట్లాడడానికి, కనిపించడానికి అతడు ఎంత కష్టపడ్డాడో చూడండి' అని ఆ వీడియోను పంచుకున్నారు.

ఇటీవల జరిగిన ఓ పెళ్లి వేడుకలో మిమిక్రీ ఆర్టిస్టు ఒకరు అచ్చం చంద్రబాబులా కనిపించే వేషధారణలో హాజరయ్యారు. వేదికపైకి వచ్చి అందరికీ విక్టరీ సింబల్ చూపించారు. చంద్రబాబులానే మాట్లాడి వధూవరులను ఆశీర్వదించారు. ఆయనలానే మాట్లాడి అక్కడున్న వారందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ వీడియో రెండురోజుల నుంచి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీన్ని ఓ అభిమాని షేర్ చేసి 'వామ్మో.. సడెన్‌గా చూసి మా పెద్దాయన అనుకున్నా. సేమ్ చంద్రబాబు లానే ఉన్నారు' అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆ పోస్టును షేర్ చేస్తూ లోకేష్ కూడా ఆశ్చర్యానికి గురి కావడం అందరినీ ఆకర్షిస్తోంది.

### ఎమ్మెల్సీ రామచంద్రయ్య కుమారుడు

## విష్ణు మృతిపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి



అమరావతి (చైతన్య రథం): టీడీపీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య తనయుడు విష్ణుస్వరూప్ మృతిపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్ ఉన్న విష్ణుస్వరూప్ గుండెపోటుతో మరణించడంపై సీఎం విచారం వ్యక్తం చేశారు. కుమారుడి మృతితో విషాదంలో ఉన్న రామచంద్రయ్య కుటుంబానికి దేవుడు మనోనిబ్బరాన్ని ఇవ్వాలని కోరారు. రామచంద్రయ్య కుటుంబ సభ్యులకు సీఎం చంద్రబాబు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

చైతన్యరథం

## రాజ్యాంగ రచనలో

# తెలుగోడి పాత్ర చిరస్మరణీయం

### ప్రముఖుల చిత్రాలు, చరిత్రతో వినూత్నంగా అసెంబ్లీ క్యాలెండర్ - ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



అమరావతి (చైతన్య రథం): భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆనాటి రాజ్యాంగ రచనలో భాగస్వాములైన తెలుగు ప్రముఖులను స్మరించుకునేలా 2025వ సంవత్సరానికి రూపొందించిన నూతన కేలండర్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఉండవల్లిలోని నివాసంలో ఆవిష్కరించారు. కేలండర్‌లో ప్రచురించిన ఒక్కో ప్రముఖుడి గొప్పతనాన్ని ముఖ్యమంత్రి ఈ కార్యక్రమంలో మరోసారి గుర్తుచేశారు. 'సైమన్ గో బ్యాక్' అంటూ తెల్లదొరలను ఎదిరించి స్వాంతంత్ర్య ఉద్యమంలో తెగువ చూపిన తెలుగుధీరుడు టంగుటూరి ప్రకాశం పంతులు భారత రాజ్యాంగ రచనలోనూ అంతే చొరవ కనబరిచారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. టంగుటూరి రాజ్యాంగంలోని ప్రధానమైన స్థానిక సంస్థలు, గవర్నర్ విచక్షణ అధికారాలు వంటి అంశాలను రూపొందించడంలో సహాయసహకారాలు అందించారని కీర్తించారు. అలాగే భోగరాజు పట్టాభిసీతారామయ్య రాజ్యాంగ సభ సంప్రదింపుల కమిటీలో సభ్యుడిగా సేవలు అందించారని, ఢిల్లీలో పరిపాలన – శాసనసభ వ్యవస్థపై సిఫార్సులు చేసిన కేంద్రపాలిత ప్రాంతాల కమిటీకి నేతృత్వం వహించారని ముఖ్యమంత్రి చెప్పారు.

#### రాజ్యాంగంలో కీలక సూచనలు

దుర్గాబాయి దేశ్‌ముఖ్ జాతీయ భాష, న్యాయ వ్యవస్థ స్వాతంత్ర్యం, మానవ అక్రమ రవాణాపై చేసిన కీలక సూచనలను రాజ్యాంగ సభ ఆమోదించిందని ముఖ్యమంత్రి అన్నారు. మోటూరి సత్యనారాయణ జాతీయ భాష గురించి విలువైన సలహాలిచ్చారని, మరో ప్రముఖుడు గోగినేని రంగనాయకులు (ఎన్జీ రంగా) రాజ్యాంగంలో అధికార వికేంద్రీకరణ, అత్యవసర అధికారాలు, రెండు సభలు, ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుపై పలు సూచనలు చేశారని ముఖ్యమంత్రి వివరించారు.

#### ప్రజాస్వామ్యం ప్రతిబింబించేలా కృషి

భూసేకరణకు నష్ట పరిహారం చెల్లించేలా నిబంధన తీసుకురావడంతోపాటు పాఠశాలలు, దేవాలయాల్లో ఎక్కడా వివక్ష ఉండకూడదని మతం, జాతి, కులం, లింగ ఆధారంగా నిరాదరణ చూపించకుండా నిబంధన రూపొందించాలని వీసీ కేశవరావు రాజ్యాంగసభలో ప్రతిపాదించారని ముఖ్యమంత్రి చంద్రబుబు తెలిపారు. డ్రాఫ్టింగ్ కమిటీ, అడ్వైజరీ కమిటీ, ప్రాథమిక హక్కులపై సబ్-కమిటీతో సహా తొమ్మిది కమిటీలలో అల్లాడి కృష్ణస్వామి భాగస్వామిగా ఉన్నారని.. పౌరసత్వం, ప్రాథమిక హక్కులు, ఎమర్జెన్సీ నిబంధనలపై రాజ్యాంగ సభలో జరిగిన చర్చల్లో చురుగ్గా పాల్గొన్నారని ముఖ్యమంత్రి చెప్పారు. రాజ్యాంగంలో మహాత్మా గాంధీ ఆలోచనలు ప్రతిబింబించేలా మొసలికంటి తిరుమలరావు కృషి చేస్తే.. ఆస్తి హక్కు, జమీందారీ వ్యవస్థ రద్దు గురించిన చర్చలో కళా వెంకటరావు ప్రముఖంగా పాల్గొన్నారని ముఖ్యమంత్రి తెలిపారు.

#### ఇక సామాజిక మాధ్యమాల్లో శాసన వ్యవస్థ సమాచారం

కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థ కోసం తొలిసారి ప్రవేశపెట్టిన సామాజిక మాధ్యమ ఖాతాలను ప్రారంభించారు. 'ఎక్స్', యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌ల ద్వారా ఇకపై ఎప్పటికప్పుడు శాసన వ్యవస్థకు సంబంధించిన సమాచారం తక్షణం అందుబాటులోకి వస్తుంది. సభా కార్యకలాపాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయని చంద్రబాబు అన్నారు. సామాజిక మాధ్యమాలు కేవలం సమాచారం కోసమే కాకుండా చట్ట సభల్లో అర్థవంతమైన చర్చలకు వేదిక కావాలని, సమాజంలో అవగాహన పెంచడానికి తోడ్పడాలని చంద్రబాబు నాయుడు చెప్పారు. సవాళ్లను స్వీకరించి, శాసనవ్యవస్థ చేపట్టిన వినూత్న ప్రయత్నాలకు మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అందిస్తున్న స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ కె రఘు రామకృష్ణ రాజులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె రఘురామకృష్ణ రాజు, రాష్ట్ర శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర పాల్గొన్నారు.

#### ప్రముఖుల స్మరణ సంతోషంగా ఉంది

*నీలం సంజీవరెడ్డి, కల్లూరు సుబ్బారావు, రాజా శ్వేతా చలపతి రామకృష్ణరంగారావు రాజ్యాంగ రూప కల్పనలో అందించిన సహకారాన్ని మరువలేమని ముఖ్యమంత్రి అన్నారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించడానికి బాధ్యత వహించిన నాయకులను -దార్శనికులను స్మరించుకోవడం సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. రాజ్యాంగ రచనలో అద్వితీయమైన సేవలందించిన తెలుగు ప్రముఖులు కీర్తిశేషులు టంగుటూరి ప్రకాశం పంతులు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, అల్లాడి కృష్ణస్వామి, కల్లూరు సుబ్బారావు, కళా వెంకటరావు, ఆచార్య ఎన్‌జీ రంగా, మొసలికంటి తిరుమలరావు, రాజా శ్వేతా చలపతి రామకృష్ణ రంగారావు, మోటూరి సత్యనారాయణ, దుర్గాబాయి దేశ్‌ముఖ్, నీలం సంజీవ రెడ్డి, విసి కేశవ రావుల చిత్ర పటాలతో పాటు, ఆనాడు సభలో వారు చేసిన ప్రసంగాంశాలను లభ్యమైన మేరకు ఈ క్యాలెండర్‌లో పొందుపరచారు.*

## నితీష్ సెంచరీపై

## సీఎం చంద్రబాబు అభినందన





*అమరావతి (చైతన్య రథం): బోర్డర్ గవాస్కర్ టెస్ట్ ట్రోఫీ 2024లో ఆస్ట్రేలియాతో మెల్‌బోర్న్‌లో జరుగుతున్న టెస్ట్ క్రికెట్‌లో విశాఖకు చెందిన భారత ఆటగాడు సెంచరీ సాధించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. ఆయన ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. 'క్రికెట్ నాలుగవ టెస్టు మ్యాచ్‌లో సెంచరీ సాధించిన విశాఖపట్నం యువకుడు కె. నితీష్ కుమార్ రెడ్డికి అభినందనలు. టెస్టు మ్యాచ్‌లలో ఈ ఘనత సాధించిన భారతీయ క్రికెటర్లలో మూడో అతి పిన్న వయస్కుడు కూడా కావడం మరింత సంతోషం కలిగిస్తున్నది. రంజీలో ఆంధ్రా తరపున ఎన్నో విజయాలు సాధించిన నితీష్‌కుమార్ రెడ్డి.. అండర్ 16లో కూడా అద్భుత విజయాలు అందుకున్న విషయం మనకు తెలిసిందే. ఇలాంటి విజయాలు మరిన్ని సాధించాలని, భారత క్రికెట్ జట్టులో ఉండి దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింప చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు.*

## నితీష్.. నీ ఆట చూసి గర్విస్తున్నా

#### ప్రపంచానికి తెలుగువారి ప్రతిష్ట చాటిచెప్పావు - సెంచరీ వీరుడికి మంత్రి లోకేష్ అభినందనలు



అమరావతి (చైతన్యరథం): తీవ్రమైన ఒత్తిడిలోనూ ఏకాగ్రత కోల్పోకుండా ధైర్యంగా, పట్టుదలతో ఆడి అద్భుతమైన సెంచరీ సాధించాడిని విశాఖ కుర్రాడు నితీష్ రెడ్డిని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అభినందించారు. జట్టు కష్టాల్లో ఉన్న సమయంలో ఆస్ట్రేలియాపై నితీష్ సెంచరీ చేయడం చూసి ఆనందించా. తీవ్ర ఒత్తిడిలోనూ ఏకాగ్రతను కోల్పోకుండా తొలి శతకం పూర్తి చేసినందుకు అభినందనలు. నితీష్ ఆట చూస్తుంటే గర్వంగా ఉంది. ఇలానే మున్ముందూ కొనసాగాలని ఆకాంక్షిస్తున్నా. ఆంధ్రప్రదేశ్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారికి ఈ సంవత్సరం గుర్తుండిపోయేలా చేసినందుకు, తెలుగువారి ప్రతిష్టను ప్రపంచ యవనికపై మారుమోగిస్తున్నందుకు ధన్యవాదాలు. కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ ఒక్కో అడుగు ముందుకేస్తూ స్వర్ణాంధ్ర దిశగా సాగిపోదాం.. అని నారా లోకేష్ పోస్ట్ చేశారు.

## తెలుగు నేల పులకిస్తోంది

#### ప్రపంచ తెలుగు రచయితల మహాసభల నిర్వహణపై సీఎం చంద్రబాబు ట్వీట్

విజయవాడ (చైతన్య రథం): ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించుకోవడం తెలుగువారికి గర్వకారణమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు పెడుతూ.. మాతృభాషను భవిష్యత్ తరాలకు పదిలంగా అందించడమే లక్ష్యంగా ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం జరిగే ప్రాంగణానికి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును పెట్టడం, ఆ మహానుభావుడు తెలుగు జాతి కోసం చేసిన త్యాగాన్ని ప్రతి ఒక్కరికీ గుర్తు చేస్తోందన్నారు. ప్రధాన వేదికకు తెలుగు భాషాభివృదికి గణనీయ కృషి చేసిన రామోజీరావు పేరు పెట్టడం అభినందనీయమని చెప్పారు. ఈ మహాసభలకు విచ్చేసిన అతిథులకు, పాల్గొంటున్న తెలుగు భాషాభిమానులకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావాలని కోరుకుంటూ.. నిర్వాహకులకు చంద్రబాబు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

చైతన్యరథం

# మన్మోహన్ అరుదైన రాజనీతిజ్ఞుడు

## ఆయన విశాల హృదయానికి మా కుటుంబం రుణపడి ఉంటుంది: మంత్రి లోకేష్ నివాళి



అమరావతి (చైతన్యరథం): భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తున్నప్పుడు.. గతంలో తమ కుటుంబం పట్ల ఎంతో విశాల హృదయంతో ఆయన స్పందించిన తీరు స్ఫురణకు వచ్చి మనసంతా కదిలిపోయిందని రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి భావోద్వేగానికి గుర య్యారు. ఈ మేరకు ఎక్స్‌లో మంత్రి లోకేష్ ఒక పోస్ట్ పెట్టారు.

2004వ సంవత్సరం మా కుటుంబానికి ఎంతో సంక్షుభిత సమయం. అంతకు ముందు ఏడాది అలిపిరి వద్ద నక్సలైట్ల భీకర బాంబుదాడి నుంచి ప్రాణాలతో బయటపడ్డ మా నాయకుడు చంద్రబాబు అప్పుడప్పుడే కోలుకుంటున్నారు. అ తరువాత 2004లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ పరాజయం పాలయింది. ఆ క్లిష్ట సమయంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం చంద్రబాబు భద్రత తగ్గించే ప్రయత్నం చేసింది. అదే జరిగిఉంటే చంద్రబాబు స్వేచ్ఛగా ప్రజల్లోకి వెళ్లేందుకు అవరోధం కలిగేది. ఆ సమయంలో చంద్ర బాబు.. అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌ను కలిసి పరిస్థితి వివరించారు. తనపై జరిగిన దాడుల గురించి తెలుపుతూ, తన ప్రాణాలకు ముప్పు ఉందంటూ భద్రతా ఏజెన్సీలు పేర్కొన్న విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. తన భద్రతను యథాప్రకారం కొనసాగించాలని కోరారు. చంద్రబాబు ప్రత్యర్థి పార్టీకి చెందిన నేత అయినప్పటికీ ఆయన విజ్ఞప్తిపై ప్రధాని మన్మోహన్ వెంటనే స్పందించారు. దేశానికి సంబంధించి చంద్రబాబు ఎంతో ముఖ్యమైన నాయకుడని చెబుతూ.. అప్పటి రాష్ట్ర ప్రభుత్వ అభిమతానికి వ్యతిరేకంగా ఆయనకు ఎన్ఎస్‌జీ కమెండోలతో పూర్తిస్థాయి భద్రతను పునరుద్ధరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇదే విషయం గురించి చంద్రబాబుకు చెబుతూ.. మీరు హైదరాబాద్ తిరిగి వెళ్లేసరికి మీ కోసం ఎన్ఎస్‌జీ భద్రత సిద్ధంగా ఉంటుందని మన్మోహన్ స్పష్టంగా చెప్పారు.

గతంలో జరిగిన ఈ ఉదంతాన్ని గుర్తుచేసుకుంటూ మంత్రి లోకేష్ శనివారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మన్మోహన్ సింగ్ అరుదైన రాజనీతిజ్ఞుడు. ఆయన విశాల హృదయానికి మా కుటుంబం రుణపడి ఉంటుంది. బాధాతప్త హృదయంతో ఆయనకు అంతిమ వీడ్కోలు అని మంత్రి లోకేష్ నివాళులర్పించారు.

# బొత్స కుటుంబపాలనకు చరమగీతం

- ఉత్తరాంధ్రను అన్నివిధాలా దోచుకుతిన్నారు
- కూటమి ప్రభుత్వంపై ఆదరణను ఓర్వలేకే బురద
- సంస్కారంతో నమస్కారం పెడితే దుష్ప్రచారమా?
- నీలిమీడియా ప్రచారంలో ఎటువంటి నిజం లేదు
- ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ధ్వజం



మంగళగిరి (చైతన్యరథం): ఎమ్మెల్యేలతో పాటు గత నవంబర్ 11న తాను అసెంబ్లీకి వెళుతూ ఎదురుపడ్డ బొత్స సత్యనారాయణకు సంస్కారంతో నమస్కారం పెడితే దుష్ప్రచా రం చేశారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ కేంద్ర కార్యా లయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తనపై వైసీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారంపై మండిపడ్డారు. అసెంబ్లీకి వెళు తున్న సమయంలోనే అదే సమ యంలో అక్కడ కూర్చుని ఉన్న ఇతర నాయకులు లేచి పలకరించారని, అది సంస్కా రంతో పలకరించడమే తప్ప అక్కడ ఎలాంటి సెన్సేషన్ చోటు చేసుకోలేదని తెలిపారు. అయితే దీనిపై అసత్య ప్రచారం జరుగుతోందని, అందులో ఎంతమాత్రం నిజం లేదని వివరించారు. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే ఉత్తరాంధ్ర చంద్రబాబు నాయకత్వం లో లోకేష్ ఆలోచనలతో అభివృద్ధి వైపు దూసుకెళుతోందని, పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్ర మాలు జరుగుతున్నాయన్నారు. మూలపేట పోర్టు, భోగాపురం ఎయిర్ పోర్ట్, విశాఖప ట్నంలో సాఫ్ట్‌వేర్ కంపెనీలు వచ్చాయి. ఇరిగేషన్, వ్యవసాయం, రోడ్ అండ్ బిల్డింగ్స్ విషయాల్లో చిత్తశుద్ధితో పరిష్కార మార్గాలు వెతుకుతున్నాం. విజయనగరం జిల్లాల్లో కొత్త నాయకత్వం ఏర్పాటు జరిగింది. కూటమి ప్రభుత్వం మంచి పనులు చేసి మంచి పేరు తెచ్చుకుంటుంటే జగన్‌కు చెందిన నీలి పత్రికలు, మీడియా దుష్ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. ఈ మీడియా వాస్తవాలను మరుగున పెడుతూ అసభ్య కథనాలను జనా ల్లోకి పంపుతూ సోషల్ మీడియాలో వచ్చిన న్యూస్‌ను వక్రీకరించి పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. యువ నాయకత్వాన్ని, జిల్లాలో కొత్తగా ఏర్పడిన నాయకత్వా న్ని బలహీనపరచాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### కుటుంబపాలనతో విజయనగరాన్ని దోచుకున్నారు

ప్రస్తుతం ఉత్తరాంధ్ర జిల్లాల్లో మంచి వాతావరణం ఉంది. కుటుంబ పరిపాలన నుంచి కూటమి పరిపాలనలోకి వచ్చాం. గత 20 సంవత్సరాలుగా ఉత్తరాంధ్రలో కుటుం బ పరిపాలన సాగుతూ వస్తోంది. ఒక్కో నియోజకవర్గాన్ని బొత్స కుటుంబసభ్యులు, లేక వారి తాలూకా మనుషులు పోటీ చేయడం జరుగుతూ వచ్చింది. పూర్తిస్థాయిలో భూ దందాలు, లిక్కర్ దందాలు చేస్తూ వచ్చారు. విజయనగరం జిల్లాలో నేడు ప్రజానీక మంతా ఏకమయ్యారు. వారిని ఎన్నికల్లో పోటీ చేయనివ్వకుండా, ఒకవేళ చేసినా గెల వకుండా చేశారు. కూటమి అభ్యర్థులనే ఏకతాటిపై గెలిపించారు. బొత్స నాయక త్వానికి ప్రజలు చరమగీతం పాడారు. వైసీపీ దీనిని జీర్ణించుకోలేకనే టీడీపీ నాయక త్వాన్ని బలహీనపరచాలని వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. టీడీపీ కార్యకర్తలను బలహీనపర్చాలనే వైసీపీ ఆలోచన ఎన్నటికీ సఫలంకాదు. అనేక సంవత్సరాలుగా మా తాత, బాబాయిలు బొత్స సత్యనారాయణ ఫ్యామిలీపై పోటీ చేస్తూ..పోరాడుతూ వస్తున్నాం. అలాంటిది వారిని కాకా పట్టామనడం అసత్య ప్రచారమే. విజయనగరం ప్రజానీకం బొత్స కుటుంబానికి మూడు సార్లు మంత్రి పదవి, మూడు సార్లు ఎంపీ, మూడు సార్లు జిల్లా పరిషత్ పదవులు ఇచ్చినా విజయనగరం జిల్లాకు చేసిందేమీ లేదు. వారి కుటుంబ పరిపాలన చేసుకుని జిల్లాను దోచుకున్నారే తప్ప జిల్లాకు ఏమీ చేయలేదు. వీరి పాలనలో విజయనగరం జిల్లా వాసులు ఎటువంటి ఆర్థిక అభివృద్ధి సాధించలేదు. ఎటువంటి పరిశ్రమలు తేలేదు. విజయనగరంలో అనేక మంది వలసలు వెళ్లారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 80 శాతం వలసలు వెళ్లాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్త ఆలోచనలతో ముందుకెళ్తోంది. పరిశ్రమలు తెచ్చే దిశగా ముందుకు సాగుతున్నాం. రాష్ట్రంలో యువ నాయకత్వాన్ని బలపరుస్తున్నారు.

### తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు...

175 అసెంబ్లీ స్థానాల్లో 88 మంది కొత్త అభ్యర్థులకు పట్టం కట్టారంటే అది టీడీపీపై ఉన్న నమ్మకం. విజయనగరం జిల్లాలో గెలుపొందిన వారు ఏడుగురు అభ్యర్థుల్లో నలుగురు కొత్తవారే. వీరిలో ముగ్గురు సీనియర్ అభ్యర్థులు. వీరంతా కలిసి కట్టుగా పార్టీని బలపరుస్తున్నారు. దీన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్ష హోదా కూడా దక్క ని వైసీపీ కుట్రలు, కుతంత్రాలు చేస్తోంది. వీరి ఆలోచనా విధానం మారాలి. భవిష్య త్తులో విజయనగరం జిల్లాను ఆదర్శ జిల్లాగా మారుస్తాం. వైసీపీ తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు, బొత్స సత్యనారాయణ భూ దందాలు, భూ కబ్జాలు మా దృష్టికొచ్చాయి. పరిష్కారానికి కృషి చేస్తున్నాం. టీడీపీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతినే విధంగా వైసీపీ ప్రవర్తిస్తోంది. రాంగ్ మీడియా రాంగ్ ఇన్ఫర్మేషన్ క్రియేట్ చేసి ప్రచారం చేస్తోంది. మాకు ప్రతిపక్షమైన వారి కాళ్లకు దండాలు పెట్టాల్సిన అవసరం మాకే మొచ్చిందని ప్రశ్నించారు.

### మంత్రి లోకేష్ సాయం..

# స్వస్థలానికి అభాగ్యురాలు

- కువైట్‌లో చిక్కుకున్న తిరుపతి జిల్లా వాసి
- యజమాని చేతుల్లో చిత్రహింసలు
- ఆదుకోవాలని ఎక్స్‌లో వేడుకోలు
- స్పందించి స్వస్థలానికి చేర్చిన మంత్రి లోకేష్



అమరావతి (చైతన్యరథం): జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి.. అక్కడ ఎదురైన విపత్కర పరిస్థితులు తట్టుకోలేక సాయం కోరిన వారికి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అండగా నిలుస్తున్నారు. ఇప్పటివరకు వివిధ దేశాల్లో చిక్కుకున్న సుమారు 25 మందిని రక్షించి స్వస్థలాలకు చేర్చారు. తాజాగా ఏజెంట్ల చేతిలో మోసపోయి కువైట్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న యల్లంపల్లి లక్ష్మిని క్షేమంగా రాష్ట్రానికి తీసుకువచ్చి కుటుంబసభ్యుల వద్దకు చేర్చారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలోని రాజీవ్ నగర్‌కు చెందిన లక్ష్మి..బతుకుదెరువు కోసం కువైట్ వెళ్లారు. అక్కడ యజమాని నిత్యం వేధింపులకు పాల్పడటంతో పాటు గదిలో నిర్బంధించి చిత్రహింసలకు గురిచేస్తుండటంతో రక్షించాలని ఎక్స్ ద్వారా మంత్రి నారా లోకేష్‌ను అభ్యర్థించారు. దీంతో మంత్రి లోకేష్.. తన టీం ద్వారా లక్ష్మిని కాపాడి స్వస్థలానికి చేర్చారు. సాయం కోరిన వెంటనే స్పందించి ఆదుకున్న మంత్రి నారా లోకేష్‌కు లక్ష్మి, ఆమె కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా జగ్గయ్యపేట

- పట్టాభిరామ్‌కు ఎంపీ కేశినేని కృతజ్ఞతలు
- చెత్త డంపింగ్‌కు ప్లాంట్ ఏర్పాటుకు వినతి



విజయవాడ (చైతన్యరథం): స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆధ్వర్యంలో శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రాష్ట్రాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా రూపొందించాలని కోరారు. ఇందులో పైలెట్ ప్రాజెక్టుగా జగ్గయ్యపేట పట్టణాన్ని ఎన్ను కున్నందుకు పట్టాభిరామ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జగ్గయ్యపేట పట్టణానికి ప్రస్తుతం ప్రతిరోజూ 18 టన్నుల తడి చెత్త, పొడి చెత్త ఉండటం జరుగుతుందని, ప్రతి ఇంటికి బండిని పంపించి చెత్త సేకరించడం జరుగుతుందన్నారు. సేకరించిన చెత్తను జగ్గయ్యపేట పట్టణంలో ఊరు బయట విలియంపేట అవతల డంపింగ్ చేయడం జరు గుతుందని తెలిపారు. అయితే పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అందువల్ల ఇబ్బందులు పడుతూ ప్రతిసారి తమ దృష్టికి సమస్యను తీసుకువస్తున్నా రని వివరించారు. మనం ఒక స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లయితే ఈ సమస్యను శాశ్వ తంగా అధిగమించవచ్చని తెలిపారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ద్వారా ఒక ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగం ఉంటుందని చెప్పారు. అదేవిధంగా జగ్గయ్య పేట పట్టణంలో చెత్త సేకరణకు ఎలక్ట్రిక్ ఆటోలను ఉపయోగించడం జరుగుతుందని, అవి తడి చెత్త వేయడం వల్ల ఎత్తు ప్రదేశాలకు వెళ్లలేక చాలా ఇబ్బందులు ఎదురవుతు న్నాయని తెలిపారు. ఎలక్ట్రికల్ ఆటోలు కాకుండా రెగ్యులర్ ఆటోలు ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా జగ్గయ్యపేట పట్టణానికి ఒక ఎక్స్‌కవేటర్, ఎర్ర కాలువ మొత్తం సిల్ట్ తీయడం కోసం మనుషులు, ఇతర సామగ్రి, పట్టణ పరిశుభ్రత కోసం స్వీపింగ్ మిషన్స్ ఏర్పాటు చేయాలని కోరారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా జగ్గయ్యపేట పట్టణాన్ని ఒక మోడల్‌గా తీసుకుని క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా రూపుదిద్దడం కోసం సమావేశం ఏర్పాటు చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో రంగాపురం రాఘవేంద్రరావు, కొఠారు సత్యనారాయణ ప్రసాద్, మేక వెంకటేశ్వర్లు, మైనేని రాధా కృష్ణ, రావూరి శ్రీను, ఏలూరి గోపాలరావు, కౌన్సిలర్లు సంగెపు బుజ్జిబాబు, గొట్టే నాగరా జు, గింజుపల్లి వెంకట్రావు, ఇర్రి నరసింహారావు, వేదులాపురి సైదా, కర్ల జోజి, అధికా రులు మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్, రాంబాబు, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నేతల అహంకారం అణిచేస్తాం

## - ఉప ముఖ్యమంత్రి పవన్ హెచ్చరిక

- ఇంకా జగన్ ప్రభుత్వమే ఉందనుకుని విర్రవీగుతున్నారు
- ఎంపీడీవోపై దాడి రాష్ట్ర యంత్రాంగంపై జరిగిన దాడిగా భావిస్తాం
- నిందితులను కఠినంగా శిక్షిస్తాం
- అధికారులకు అండగా ఉంటాం
- 11 సీట్లకు పరిమితం చేసినా వైసీపీ నేతకు బుద్ధి రాలేదు
- వైసీపీ నాయకుడు సుదర్శన్ రెడ్డి దాడిలో గాయపడ్డ ఎంపీడీవోకు పరామర్శ
- అధైర్యపడొద్దని కుటుంబ సభ్యులకు భరోసా





కడప (చైతన్యరథం): అహంకారం నడి నెత్తికి ఎక్కిన వైసీపీ నాయకులు అధికారులపై దాడులు చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వీళ్లను ప్రశ్నిస్తే ఎవరైనా ఒకటే.. వీరి ఆధిపత్యం ఒప్పుకోకపోతే ఎవరి మీదనైనా దాడులకు దిగే స్వభావం చూపిస్తారని మండిపడ్డారు. తమను ప్రశ్నించే వాళ్లను, ఎదురు చెప్పే వాళ్లపై దాడి చేసి భయపెట్టడాన్ని వైసీపీ నాయకులు నైజంగా మార్చుకున్నారని ధ్వజమెత్తారు. ఇలాంటి వారి అహంకారం దించుతాం.. తోలు తీసి కింద కూర్చోబెడతామని హెచ్చరించారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండల ఎంపీడీవో జవహర్ బాబుపై వైసీపీ నాయకుడు సుదర్శన్ రెడ్డి చేసిన దాడి అధికార యంత్రాంగం మొత్తం మీద చేసిన దాడిగా భావిస్తున్నామని స్పష్టం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం అధికారిక విధుల్లో ఉన్న ఎంపీడీవో జవహర్ బాబుపై వైసీపీ నాయకుడు సుదర్శన్ రెడ్డి సుమారు 20 మంది అనుచరులతో వచ్చి కార్యాలయంలోనే దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాల పాలైన జవహర్ బాబుని కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించిన నేపథ్యంలో ఆయనను పరామర్శించేందుకు శనివారం మధ్యాహ్నం పవన్ వచ్చారు. చికిత్స పొందుతున్న జవహర్ బాబు ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. జవహర్ బాబుకి పలు ఆరోగ్య సమస్యలు ఉన్న దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలని, మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రిలోనే ఉన్న జవహర్ బాబు కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని, అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు.

అనంతరం ఆసుపత్రి బయట మీడియాతో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ విధుల్లో ఉన్న ఎంపీడీవో జవహర్ బాబుపై దాడికి పాల్పడిన వ్యక్తి చట్టాల గురించి బాగా తెలిసిన వ్యక్తి.. గతంలో ఏపీ స్టేట్ లా ప్రాసిక్యూషన్ ఆఫీసర్‌గా ఉన్నారు.. అలాంటి వ్యక్తి కూడా ఎంపీడీవోపై భౌతిక దాడికి పాల్పడడం అనాగరికం.. హేయమని తప్పుబట్టారు. సదరు వైసీపీ నాయకుడి తల్లి ఎంపీపీగా పని చేస్తున్నారు. ఆమె ప్రజాప్రతినిధి అయితే ఆమె కార్యాలయ తాళాలు ఆమెకే ఇవ్వాలి. ఆ కార్యాలయ తాళాలు ఇవ్వను అని నిబంధనలు గురించి చెబితే ఎంపీడీఓ జవహర్ బాబుపై తీవ్రంగా దాడి చేయడం అప్రజాస్వామికమని పవన్ విమర్శించారు.

### ఈ దాడి చిన్న విషయం కాదు

ఎంపీడీఓపై అహంకారంతో ఇష్టం వచ్చినట్లు దాడి చేయడం ఏమిటి? ఇది ఆయన ఒక్కరి మీద జరిగిన దాడిగా మేము భావించడం లేదు. రాష్ట్ర యంత్రాంగం మీద జరిగిన దాడిగా భావిస్తున్నాం. ఇందులో ఎంతటి వారు ఉన్న సరే చట్టం ముందుపెడతాం. ప్రజల కోసం పనిచేస్తున్న అధికారులపై భౌతిక దాడులకు పాల్పడితే వారి ఆత్మస్థైర్యం పూర్తిగా దెబ్బతింటుంది. భవిష్యత్తులో కూడా దృఢంగా పని చేయలేరు. అధికార యంత్రాంగాన్ని భయపెట్టాలని భావిస్తే మేం చూస్తూ ఊరుకోబోమని పవన్ స్పష్టం చేశారు.

### 11 సీట్లు ఇచ్చినా బుద్ధి రాలేదు

వైసీపీ నాయకులను ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసినా వారి అహంకారం తగ్గలేదు. అహంకారంతో బరితెగించి ఈ పరిస్థితికి వచ్చారు. ప్రస్తుతం ఎంపీడీవో జవహర్ బాబుపై దాడి చేసిన జిల్లా సుదర్శన్ రెడ్డి అనే వ్యక్తికి దాడులు చేయడం కొత్త కాదు. గతంలో కూడా ఎంపీడీవోగా పనిచేసిన ప్రతాప్ అనే అధికారిపైనా ఇదే జిల్లా సుదర్శన్ రెడ్డి దాడి చేశారు. శేఖర్ నాయక్, శ్రీనివాసులు రెడ్డి అనే అధికారులు మీదా దాడి చేశారు. ఇది మా రాజ్యాంగం అనుకొని వారికి ఎదురు చెబితే ఇష్టానుసారం అందరిపై దాడులు చేస్తున్నారు. చట్టం ముందు ఎవరైనా ఒక్కటే. వీరి ఆధిపత్య అహంకారాన్ని తగ్గించుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని పవన్ అన్నారు.

### చూస్తూ ఊరుకోం

ఎంపీపీకి మాత్రమే తాళాలు ఇస్తామని చాలా మర్యాదగా, హుందాగా చెప్పిన జవహర్ బాబుపై ఇష్టానుసారం దాడి చేశారు. గడియ వేసి దాడికి తెగబడ్డారు. ఇది క్షమించరాని నేరం. జవహర్ బాబుకి హైబీపీతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. భౌతికంగా దాడి చేయడమే కాకుండా ఆయన కులాన్ని కూడా దూషించి.. సుదర్శన్ రెడ్డి తన అహంకారాన్ని మరోసారి చూపించారు. వీరి ఆధిపత్యాన్ని ప్రశ్నించే ప్రతి ఒక్కరిపై దాడి చేయడం అలవాటుగా మారింది. ఇంకా గత ప్రభుత్వమే ఉందనుకుంటూ, ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనే ధోరణిలో వైసీపీ నేతలు ఉన్నారు. తప్పు జరిగితే చూస్తూ ఊరుకునే వ్యక్తిని కాదు. ఉప ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న నేను తప్పు చేసినా బలంగా శిక్ష పడాలి అని భావించే వ్యక్తిని. అలాంటిది అధికారిక విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై దాడి చేయడం తీవ్రంగా పరిగణిస్తాం. సంఘటన జరిగిన వెంటనే జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించామని పవన్ తెలిపారు.

### అధికారులకు అండగా కూటమి ప్రభుత్వం

ప్రజల కోసం విధులు నిర్వహిస్తున్న అధికార యంత్రాంగంపై దాడులు చేస్తే ఏ మాత్రం సహించేది లేదు. నిబద్ధతగా పనిచేసే అధికారులకు కూటమి ప్రభుత్వం తోడుగా ఉంటుంది. ప్రజల విషయాల్లో కూటమి ప్రభుత్వం త్రికరణ శుద్ధిగా పని చేస్తుంది. జవహర్ బాబు ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారు అని నేను ఇక్కడికి రాలేదు. రాజకీయాలకు అతీతంగా, కులాలకు అతీతంగా కష్టపడి పని చేసే అధికారులకు ధైర్యం చెప్పడానికి వచ్చాను. విధులు నిర్వర్తిస్తున్న వారిపై ఇష్టానుసారం భౌతిక దాడులకు పాల్పడితే ఊరుకునేది లేదు. కేసులో ఉన్న అందర్నీ తప్పనిసరిగా పట్టుకోవాలని, తప్పించుకున్న తొమ్మిది మందిని కూడా వెంటనే పట్టుకోవాలని ఎస్పీకి చెప్పాం. ఈ కేసులో నిందితులందరికీ చట్టపరంగా శిక్ష పడేలా చూస్తామని పవన్ స్పష్టం చేశారు.

### రాయలసీమ యువతలో చైతన్యం రావాలి

బాధితుడైన ఎంపీడీఓ జవహర్ బాబు భార్య భయపడుతున్నారు. అలాంటి పరిస్థితికి ఇక్కడ ప్రజలను కొందరు తీసుకొని వచ్చారు. ఆ పార్టీ నాయకుడికి సూచిస్తున్నాను... వాళ్ల పార్టీలో ఇలాంటి దౌర్జన్యం చేసే వారిపై దృష్టి పెట్టి సరి చేసుకోవాలి. ప్రజలు ఇలాంటి బెదిరింపులను ఎదిరించి 11 సీట్లు ఇచ్చినా వాళ్ళకి బుద్ధి రాలేదు. రాయలసీమ ప్రజలకు... ముఖ్యంగా యువతకు, మహిళలకు నేను చెబుతున్నది ఒక్కటే. దేనికీ, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. ఇలాంటి దాడులు, దౌర్జన్యాలతో పేట్రేగిపోయినప్పుడు కచ్చితంగా యువత ప్రశ్నించాలి. అవసరమైతే దాడులు చేసే వారికి ఎదురు తిరగాలి. ఓటు వేసేశాం అక్కడితో పని అయిపోయింది అనుకోవద్దు. మార్పు అనేది కచ్చితంగా యువత నుంచే రావాలి. తప్పు చేసేవారు ఎంతటి వారైనా వారిని వదిలిపెట్టవద్దు. ఆఖరికి కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న దళిత అధికారులకు కూడా రక్షణ కరవైంది. వారు ప్రజల కోసం స్వేచ్ఛగా పని చేయలేని పరిస్థితులు ఉన్నాయి. ఇలాంటి నాయకులను మళ్లీ మరోసారి ఎన్నికల్లో పాల్గొననీయకుండా యువతే పూనుకోవాలి. ఇలాంటి నాయకులు మాకు అక్కర్లేదు అని ప్రజలే బలంగా చెప్పాలి. రాయలసీమ యువతకు అండగా నిలుస్తాం. అధికారిక ఆధిపత్య అహంకారాన్ని సమష్టిగా ఎదుర్కొందాం. అధికారులపై దాడులు చేసే ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా పక్కా చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు ఇచ్చాం. అధికారులపై భౌతిక దాడులకు పాల్పడే ఎలాంటి వ్యక్తులైన ఊరుకోవద్దని, కచ్చితంగా అధికార యంత్రాంగానికి అండగా నిలబడాలని చెప్పాం. ఎంపీడీవో జవహర్ బాబు భార్య కూడా తాము నిస్సహాయులం అని, ఏమీ చేయలేమని, మళ్లీ బయటకు వస్తే ఎలాంటి దాడులు జరుగుతాయోనని భయపడుతున్నారు. మేం ఆ కుటుంబానికి అండగా నిలుస్తాం. దీనిపై జిల్లా కలెక్టర్, ఎస్పీలకు తగు ఆదేశాలు ఇస్తాం. రాయలసీమలో అహంకారం తలకెక్కి ఆధిపత్యం కోసం ఎంతకైనా తెగించే వారిని చట్టానికి అప్పగిస్తాం. యువత కూడా చైతన్యవంతులై ఈ దాష్టీకాలను ఎదిరించాలని పవన్ పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అరవ శ్రీధర్, పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, అన్నమయ్య, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, కడప జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ, తదితరులు పాల్గొన్నారు.

---

### గాలివీడు ఎంపీడీవోపై దాడి..

# వైసీపీ నేతల బరితెగింపునకు పరాకాష్ట

- నిందితులందరినీ కఠినంగా శిక్షిస్తాం
- హోంమంత్రి అనిత స్పష్టీకరణ
- గాయపడిన ఎంపీడీవోకు ఫోన్‌లో పరామర్శ
- జిల్లా ఎస్పీతో దాడి ఘటనపై ఆరా

అమరావతి (చైతన్యరథం): అధికారులపై దాడికి తెగబడటం వైసీపీ నాయకుల అహంకారానికి, బరితెగింపునకు పరాకాష్ట అని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు. వైసీపీ నేతల దాడిలో గాయపడిన అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబును హోంమంత్రి వంగలపూడి అనిత ఫోన్ చేసి పరామర్శించారు. విధి నిర్వహణలోని అధికారిపై విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డ ఘటనను కూటమి ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లు ప్రభుత్వం మారినా కడప జిల్లాలో నేటికీ అధికారులు, సామాన్యులపై దాడులు జరుగుతుండడం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల అహంకారానికి, ఆధిపత్య ధోరణికి నిదర్శనమన్నారు. ఎంపీడీవో కార్యాలయంలోకి ప్రవేశించి, అధికారి గొంతుపైనే కాలేసి తొక్కి, నానా దుర్భాషలాడి పిడిగుద్దులతో విచక్షణరహితంగా దారుణంగా ప్రవర్తించిన వారిలో ఎవరినీ వదలబోమని హోంమంత్రి పేర్కొన్నారు. ఎంపీడీవో జవహర్ బాబుకి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని, భద్రత ఏర్పాట్లు చేస్తామని హోంమంత్రి భరోసానిచ్చారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడికి ఫోన్ చేసి ఎంపీడీవోపై దాడి ఘటనకు సంబంధించిన తాజా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే దాడికి పాల్పడిన వైసీపీ నాయకులను అదుపులోకి తీసుకున్నట్లు హోంమంత్రికి జిల్లా ఎస్పీ వివరించారు. మొత్తం 20 మంది వైసీపీ నాయకులు దాడిలో పాల్గొన్నట్లు ప్రాథమిక సమాచారం ఉందని, చట్టప్రకారం వారిపై కఠిన చర్యలు చేపడతామన్నారు. విధి నిర్వహణలో ఉన్న అధికారిపై దాడి చేయడం పట్ల హోంమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. దౌర్జన్యాలకు, దాడులకు పాల్పడిన వారిపై అవసరమైతే రౌడీ షీట్ తెరవడానికి వెనకాడబోమని హోంమంత్రి అనిత హెచ్చరించారు.

---

# బాధిత రైతు కుటుంబానికి అండగా ఉంటాం

### - కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత



అమరావతి (చైతన్యరథం): వైఎస్సార్ కడప జిల్లా దిద్దేకుంట గ్రామంలో రైతు కుటుంబం ఆత్మహత్య చేసుకోవడం జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. పొలంలోనే భార్యాబిడ్డలతో కలిసి రైతు ఆత్మహత్యకు పాల్పడడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలం దిద్దేకుంట గ్రామానికి చెందిన నాగేంద్ర (40) వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాడన్నారు. శుక్రవారం రాత్రి తన భార్య వాణి (38), కుమార్తె గాయత్రి (12), కుమారుడు భార్గవ్ (11)తో కలిసి నాగేంద్ర ఆత్మహత్యకు పాల్పడడం తీవ్ర ఆవేదనకు గురిచేస్తోందన్నారు. రైతు కుటుంబం ఆత్మహత్యపై జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఇన్చార్జి ఎస్పీ విద్యా సాగర్ నాయుడుతో ఫోన్లో మాట్లాడామన్నారు. తక్షణమే రైతు కుటుంబం ఆత్మహత్యకు దారితీసిన కారణాలపై విచారించాలని ఆదేశించామన్నారు. బాధిత రైతు కుటుంబానికి ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని మంత్రి సవిత తెలిపారు.



## జగన్‌రెడ్డీ..

# ఆపు నీ డ్రామాలు

### గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజం

- ప్రజలపై విద్యుత్ భారాలు మోపి నేడు ధర్నాలా?
- వేల కోట్ల అప్పులతో విద్యుత్ వ్యవస్థను ముంచావు
- గత ఐదేళ్లతో ఉత్పత్తి సంస్థలనూ నిర్వీర్యం చేశారు
- హిందుజాకు రూ.1400 కోట్లు అప్పనంగా చెల్లించారు
- ప్రతిఫలంగా కేపీహెచ్‌బీలో 10 ఎకరాలు కొట్టేశారు
- 2014-2019లో బాబు పాలనలో మిగులు విద్యుత్
- 2019-24 మధ్య అప్పులు, అవినీతితో సంక్షోభం
- రాష్ట్రానికి రూ.1,29,500 కోట్ల నష్టం చేకూర్చారు

మంగళగిరి (చైతన్యరథం): దొంగే..దొంగ దొంగ అన్న చందంగా గత ప్రభుత్వంలో విద్యుత్ చార్జీల భారం మోపి నేడు కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచిందంటూ ప్రజలను మభ్యపెడుతూ ధర్నాలు చేయడం సిగ్గుచేటని గృహనిర్మాణ, సమాచార పౌరసం బంధాల మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ఐదేళ్ల తప్పులను కప్పిపుచ్చుకునేందు కు కూటమి ప్రభుత్వంపై బురద జల్లేందుకు విద్యుత్ ఛార్జీ లు పెంచారంటూ అబద్ధపు ధర్నాలు నిర్వహిస్తే నమ్మే స్థితిలో ప్రజలు లేరని మండిపడ్డా రు. విద్యుత్ వ్యవస్థను నాడు జగన్‌రెడ్డి పూర్తిగా భ్రష్టు పట్టించారు. గత వైసీపీ ప్రభు త్వం ప్రతి వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వార్థం, అనుభవ రాహిత్యం, తమ వారికి ప్రజల సొమ్ము దోచిపెట్టాలనే గుణంతో జగన్ పాలన సాగించడం వల్లే విద్యుత్ రంగం గత ఐదేళ్లు భ్రష్టు పట్టిందని తెలిపారు.

### లోటు విద్యుత్‌ను మిగులు విద్యుత్‌గా మార్చిన చంద్రబాబు

దాదాపు 23 మిలియన్ యూనిట్ల లోటులో చంద్రబాబు ప్రభుత్వ పాలన 2014లో ప్రారంభ మైంది. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు పాలనలో రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ ఉత్పత్తి చేసి జగన్ చేతిలో పెట్టాడు. గత ఐదేళ్లు పాలించిన జగన్‌రెడ్డి... ఈ రోజు విద్యుత్ వ్యవస్థను నిర్వీర్యం చేసి విద్యుత్ ఛార్జీలు పెంచాడు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తికి అనేక సంస్థలు ఉన్నాయి. కేవలం జగన్ తన అవినీతి, కక్ష సాధింపు చర్యల మూలంగానే ఈ విద్యుత్ వ్యవస్థకు నేడు ఈ దుస్థితి పట్టింది. గత ఐదేళ్ల జగన్ పాలనలో పది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి రూ.32 వేల కోట్ల భారం ప్రజలపై జగన్ వేశాడు. ఇది అంతా గుర్తుపెట్టుకోవాలని హితవుపలికారు. మైలవరం సోలార్ ప్లాంట్‌పై దాడి చేసి ధ్వంసం చేశాడు. చట్ట విరుద్ధంగా పీపీఏలు రద్దు చేసుకోవడంతో 7 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని కోల్పోవడం జరిగింది. వారిని పోత్సహించి ఉంటే మరో 10 వేల మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగేది. విద్యుత్ మరింత తక్కువ ధరకే ప్రజలకు అందజేసే వాళ్లం. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులు నమ్మకం కోల్పోయేలా గత ఐదేళ్ల పాటు జగన్‌రెడ్డి పాలన సాగించాడు చేశాడు. ఇంటర్నేషనల్ బ్యాంకింగ్ వ్యవస్థలు, ఫైనాన్షి యల్ సంస్థలు ఏపీకి అప్పులు ఇచ్చేందుకు భయపడ్డాయి. కానీ నేడు చంద్రబాబు వచ్చాక అన్ని సంస్థలు ముందుకు వస్తున్నాయి. విద్యుత్ కానీ ఇతర రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయి. గత ప్రభుత్వం చేసుకున్న పీపీఏ రద్దు చేయకుండా ఉండి ఉంటే కొన్ని వేల మెగావాట్లు ఉత్పత్తి పెరిగేది.. ఉద్యోగావకాశాలు కూడా లభించేవని హితవుపలికారు.

### పోలవరం పూర్తి చేసి ఉంటే విద్యుత్ ఆదా

పోలవరం విద్యుత్ ప్రాజెక్ట్‌ను 2021 కల్లా ప్రారంభిస్తామని వైసీపీ ప్రకటన చేసింది. ఇప్పుడు పోలవరం పూర్తిగా ధ్వంసం చేశారు. విద్యుత్ ప్లాంట్ ఆలస్యం కారణంగా రూ.4 వేల కోట్ల భారం ప్రజలపై పడింది. కృష్ణపట్నం వీటీపీఎస్‌లో థర్మల్ విద్యుత్ ఉత్పాదనకు సిద్ధంగా ఉన్నా స్వార్థంతో వాళ్లతో బేరం కుదరక కమీషన్‌ల కోసం ఆలస్యం చేయడం వల్ల తీవ్ర నష్టం జరిగింది. విద్యుత్ రంగంలో రూ.49 వేల కోట్లు అప్పులు తెచ్చిన జగన్‌రెడ్డి రాష్ట్రంలో ఒక్క విద్యుదుత్పత్తి పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదు. రూ.10,800 కోట్లు అత్యధిక వడ్డీలకు తెచ్చి ఏపీని నట్టేట ముంచి ప్రజలపై భారం పడేలా చేశారు. ఈరోజు ధర్నాల పేరుతో కొత్త డ్రామాలు ఆడుతున్నారు. జగన్ రెడ్డి స్వార్థం కారణంగా కావాల్సిన వాళ్లకి ఆర్డర్లు ఇచ్చి రూ.వేల కోట్ల రూపాయల విలు వైన పరికరాలు కొనుగోలు చేశారు. అవసరం లేకున్నా లక్షల ట్రాన్స్‌ఫార్మర్లు, ఎర్త్ వైర్లు కొనుగోలు చేశారు. నేడు అవన్నీ నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని ఏ విధంగా వాడు కోవాలో కూడా అధికారులకు అంత చిక్కడం లేదు. ఆ భారం అంతా పేద ప్రజలపైనే పడుతుంది. విద్యుత్ ఛార్జీల పెంపు ధరలను సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగులేటరీ కమిషన్‌కు అప్రూవల్ పెట్టింది. వైసీపీ ప్రభుత్వమే ఈ విద్యుత్ ధరలు పెరిగేలా చేసింది. చంద్రబాబు వల్ల ఈ విద్యుత్ భారాలు పెరగలేదని ప్రజలు గమనించాలి. కావాల్సిన వాళ్లకి నిధులు దోచిపెట్టడమే కాకుండా అత్యధిక నిధులతో కొని వేల కోట్ల విలువైన విద్యుత్ పరికరాలు కొనుగోలు చేశారు. అప్పులు తెచ్చిన డబ్బులు కూడా విద్యుత్ సంస్థల కోసం వినియోగిం చలేదు. ఆ డబ్బులతో ఇష్టారీతిన జగన్‌రెడ్డి ఖర్చు చేశాడు. ఇతర ఇతర కార్పొరేషన్ల పేరుతో నిధులు దారిమళ్లించాడు.

### సరఫరా లేకున్నా హిందుజాకు రూ.1400 కోట్లు చెల్లింపులు

హిందుజాకు విద్యుత్ సరఫరా చేయకపోయినా రూ.1400 కోట్లు చెల్లించారు. దానికి ప్రతిఫలంగా కూకట్‌పల్లిలో 10ఎకరాల భూములు బదలాయించారు. ఇలాంటి అవి నీతి స్వార్థపూరిత చర్యల వల్ల ప్రజలపై విద్యుత్ భారం పడుతోంది. విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందంలో అమెరికాలోని ఓ కోర్టే తేల్చిచెప్పిందంటే జగన్‌రెడ్డి ఎంత పెద్ద దొంగో అర్థం చేసుకోవాలి. సెకీ ద్వారా రూ.1,750 కోట్లు జగన్‌కు ముట్టినట్టు అమెరికా కోర్టు లు, దర్యాప్తు ఏజెన్సీలే చెబుతున్నాయి. రూ.3,850 భారం పడేలా వేరే రాష్ట్రాలతో సోలా ర్ పవర్ కొనుగోలుకు చేసుకున్న అగ్రిమెంట్ ద్వారా నేడు ప్రజలపై విద్యుత్ భారం పడిం ది. దాదాపు లక్ష కోట్ల విద్యుత్ భారం జగనరెడ్డి ఈ ఐదేళ్లలో పెట్టి వెళ్లాడు. కృష్ణపట్నం వీటీపీఎస్‌ను సరైన సమయానికి ప్రారంభించి ఉంటే ఓపెన్ మార్కెట్‌లో మనం విద్యుత్ కొనాల్సిన పరిస్థితి వచ్చేది కాదు. ప్రజలపై భారం పడేది కాదు. కేవలం స్వార్థంతో ముడుపుల కోసం ఓపెన్ మార్కెట్‌లో విద్యుత్ కొని భారం వేశాడు. వేల మెగావాట్ల పవర్ ప్లాంట్లకు కావాల్సిన ముడి సరుకు సిద్ధం చేసుకుని నడిపించాలి. కానీ ప్రతిరోజూ బొగ్గు ఉందా లేదా అవి వెతుక్కోవాల్సిన పరిస్థితికి నాడు జగన్‌రెడ్డి తీసుకొచ్చాడు. గత ప్రభు త్వంలో నాసిరకం బొగ్గు వల్ల సరైన విద్యుత్ ఉత్పత్తి జరగలేదు. థర్మల్ పవర్ ప్రాజెక్ట్ లను నిర్వీర్యం చేశాడు. ఈ రోజు చంద్రబాబు ప్రభుత్వం ఏదో విద్యుత్ ఛార్జీలు పెంచి నట్టు డ్రామాలు ఆడుతున్నాడు. ఈ వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయనే జగన్‌రెడ్డి దొంగ నాటకాలు మొదలుపెట్టాడు. 20 వేల మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లు చంద్రబాబు ప్రారం భించిన కారణంగానే రైతులకు ఉచిత కరెంట్ ఇచ్చాం. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ ఉచిత విద్యుత్ ఇచ్చాం. ఆక్వా రైతులకు యూనిట్ రూ.1.50 పైసలకే ఇచ్చాం.

### గత ప్రభుత్వంలో రూ.1,29.500 కోట్ల నష్టం

టీడీపీ పాలనలో విద్యుత్ ఛార్జీలను పెంచలేదు. గత ఐదేళ్ల జగన్ పాలనలో విద్యుత్ ఛార్జీల భారం రూ.32,166 కోట్లు వేశాడు. విద్యుత్ సంస్థలపై దాదాపు రూ.50 వేల కోట్ల అప్పులు పెరిగాయి. వీటీపీఎస్, కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్ల ఏర్పాటులో జాప్యం కారణంగా రూ.12,818 కోట్లు నష్టం ఏపీకి జరిగింది.. పోలవరం ప్రాజెక్ట్‌ను సకాలం లో పూర్తి చేయకపోవడంతో విద్యుత్ ఉత్పత్తికి నోచుకోక రూ.4,737 కోట్లు నష్టం జరి గింది. ఇలా మొత్తం రూ.1,29,500 కోట్లు విద్యుత్ రంగంలో నష్టం జగన్‌రెడ్డి పెట్టి పోయాడు. విద్యుత్ భారాలకు మూలకారణంగా జగన్‌రెడ్డి ఒక్కడే. వైసీపీ ప్రభుత్వ చేతకాని పాలన కారణంగానే ఈ విద్యుత్ ఛార్జీల భారం పడిందని ప్రజల గమనించాలని తెలిపారు.

# భాష లేకపోతే ఎన్ని ఉన్నా అభాగ్యులమే

- ఎన్టీఆర్ వల్ల తెలుగువారికి గౌరవం
- తెలుగుభాషాభివృద్ధికి ప్రభుత్వాలు పూనుకోవాలి
- భాషోద్యమంలో ప్రజల భాగస్వామ్యం కీలకం
- ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభల్లో మాజీ సీజేఐ ఎన్వీ రమణ



విజయవాడ (చైతన్యరథం): దివంగత నేత ఎన్టీఆర్ వల్ల తెలుగు భాషకు.. ప్రజలకు గౌరవం పెరిగింది.. ప్రభుత్వ అవార్డులకన్నా సమాజా న్ని మేల్కొలిపే రచనలే మిన్న.. తెలుగును పరిపుష్టం చేసేలా ప్రభుత్వాలు ఆలోచించాలి.. పత్రికలు, ఛానళ్లు తెలుగు అభివృద్ధికి పాటుపడాలి.. తమిళ నాడు తరహాలో మన పాలకులూ భాషాభివృద్ధికి కృషి చేయాలి..తెలుగుకు మద్దతిచ్చేవారికే ఓటు అని ప్రజలతో చెప్పించాలి.. అలా చెప్పిస్తేనే.. మాతృభాష అభివృద్ధి చెందుతుంది, పూర్వ వైభవం దక్కుతుందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు.

విజయవాడలో జరుగుతున్న ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభల్లో శనివారం పాల్గొన్న జస్టిస్ రమణ మాట్లాడుతూ తెలుగు భాషను కాపాడుకుందాం.. ఆత్మాభిమానాన్ని పెంచుకుందాం అనే నినాదంతో ఐక్యత చాటేందుకు నలుమూలల నుంచి విజయవాడకు తరలివచ్చిన వారందరికీ వందనాలు తెలియజేస్తున్నానన్నారు. తెలుగు తల్లి ముద్దుబిడ్డ, మహోన్నత వ్యక్తి, తుది శ్వాస వరకూ తెలుగు భాష, సంప్రదాయాల పరిరక్షణ కోసం పోరాడిన యోధుడు రామోజీరావు సభా వేదిక నుంచి మిమ్మల్నందర్నీ చూస్తుంటే.. యావత్ తెలుగు ప్రపంచం నా ముందు సాక్షాత్కరిస్తోంది. విశ్వవ్యాప్తంగా ఉన్న తెలుగువారు మన సంస్కృతి, భాషను మరిచిపోకూడదని.. తెలుగు జాతి కీర్తి ప్రతిష్టలు నిత్యం వెలుగొందాలని కోరుకునే వ్యక్తిని నేను. తెలుగుభాష పలుకుబడి వినసొంపైనది. అది సంగీతంలా ఉంటుంది. సామాన్య ప్రజలు కూడా కవితా ధోరణిలో మాట్లాడగలిగే అందమైన భాష తెలుగు. ఇంత అద్భుతమైన మన తల్లి భాష తెలుగును.. వ్యాపార, రాజకీయ ప్రయోజనాల కోసం వేరే భాష, సంస్కృతి వచ్చి కొల్లగొట్టడాన్ని మనం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదని జస్టిస్ రమణ ఉద్బోధించారు.

### ఘన వారసత్వం మరవొద్దు

తెలుగు భాష, సంస్కృతిని పరిరక్షించుకున్నప్పుడే మనం గొప్పవారమవుతాం. భాష లేకపోతే.. ఎన్ని ఉన్నా చరిత్ర లేని అనాథలం, అక్షరం లేని అభాగ్యులమే. మన సంస్కృతి, భాష చిరకాలం నిలిచి ఉండేలా.. శ్రీశ్రీ, ఆరుద్ర, విశ్వనాథ సత్యనారాయణ, సినారెలాంటి గొప్ప కవులు, రచయితలు.. భానుమతి, సూర్యకాంతం, జమున, సావిత్రి, గుమ్మడి, జగ్గయ్య, అక్కినేని, ఎన్టీఆర్, రేలంగి, ఎస్వీఆర్, ఘంటసాల, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఇలా ఎందరెందరో దిగ్గజాల ఘనమైన వారసత్వం మనది. ఈ వారసత్వం మరవకండి. మీరు గుర్తుంచుకోండి.. మీ పిల్లలకు గుర్తు చేయండి. భాష అనేది భావ వ్యక్తీకరణకు ఒక సాధనం. మనందరి ప్రస్తుత కర్తవ్యం అభివృద్ధితోపాటు.. భాషా సంస్కృతులను రక్షించుకోవటమేనని జస్టిస్ రమణ పిలుపు ఇచ్చారు.

### పరభాషపై వ్యామోహం వీడండి

తెలుగు జాతి అంటే మదరాసీలు కాదని చాటిచెబుతూ తెలుగు రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు ప్రాణాలు విడిచారు. తెలుగు అతి ప్రాచీన భాషగా గుర్తింపు పొందింది. పురాణాలు, ఇతిహాసాలు దాటి ప్రజల భాషగా తెలుగు భాష మారింది. తెలుగు భాష వృద్ధిపై మన ప్రభుత్వాలు దృష్టి పెట్టింది లేదు. కొన్ని దేశాల్లో వారి మాతృభాషలో విద్యాబోధన చేసి అద్భుతాలు సాధించారు. ఆయా దేశాలు వారి సాంకేతికతను, విజయాలను వారి భాషలోనే రాసుకున్నాయి. భవిష్యత్తు తరాలకు మాతృభాష పై ఒక గౌరవం కలిగించాయి. ఆ తరహాలో మన తెలుగు భాషకు ప్రాధాన్యత ఇవ్వలేదు. పర భాషను నేర్చుకోండి... వ్యామోహం పెంచుకోకండి. మాతృభాషలో విద్యను అభ్యసించి చాలా మంది ఉన్నత స్థితికి చేరారు. పెట్టుబడిదారులు ఇంగ్లీషు భాష ఉంటేనే ఉద్యోగాలు అనే పరిస్థితి కల్పించారు. తెలుగు భాషలో చదివి... దేశ విదేశాల్లో రాణిస్తున్న వారు ఎందరో ఉన్నారు. ప్రజా బాహుళ్యంలో మాతృభాషలోనే అన్ని నిర్ణయాలు ఉండాలని జస్టిస్ రమణ సూచించారు.

### ప్రజా భాగస్వామ్యం ముఖ్యం

ప్రభుత్వాలు కూడా తెలుగు భాషలోనే ఆదేశాలు ఇచ్చే ఆలోచన చేయాలి. తెలుగు భాష వైభవం వల్లే తెలుగు రాష్ట్రాలకు కీర్తి ఉంటుంది. మాతృభాషపై మమకారం ఉన్న వారి వల్లే మన భాషకు గౌరవం దక్కుతుంది. మానవ బంధాలతో కుడిన రచనలే కలకాలం ప్రజల్లో నిలుస్తాయి. కన్యాశుల్కం వంటి రచనలే ఇందుకు ఉదాహరణ. తెలుగు భాషను పరిపుష్టం చేయాలనే అలోచన పై ప్రభుత్వం సానుకులంగా స్పందించాలి. పత్రికలు, టీవీ ఛానళ్లు కూడా తెలుగు భాష అభివృద్ధి కోసం పాటుపడాలి. లేదంటే భవిష్యత్తులో తెలుగు పేపర్లు, ఛానళ్లు చూసే పరిస్థితి ఉండదు. తమిళనాడులో అక్కడ భాషాభివృద్ధికి ఎన్నో చర్యలు తీసుకుంటున్నారు. ఆ తరహాలో మన దగ్గర పాలకులు స్పందించడం లేదు. అక్కడ ఉన్న ఐక్యత, మన దగ్గర లేదనేది వాస్తవం. కవులు, భాషాభిమానులను చూసి ప్రభుత్వాలు భయపడవు. ప్రజలను కూడా తెలుగు భాషోద్యమంలో భాగస్వామ్యం చేయాలి. తెలుగు భాషకు మద్దతు ఇచ్చేవారికే ఓటు అని ప్రజలతో చెప్పించండి. అప్పుడే మన భాష అభివృద్ధి, వైభవం తప్పకుండా సాకారం అవుతుందని జస్టిస్ రమణ ఉద్ఘాటించారు.

# రావులపాలెంలో వైసీపీ నేతల భూకబ్జా



- జగ్గిరెడ్డి మేనమామ, మాజీ సర్పంచ్ నిర్వాకం
- కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో విన్నవించినా పట్టించుకోలేదు
- విచారణ జరిపించాలని ప్రజావినతుల్లో ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించిన మంత్రి ఆనం, పల్లా శ్రీనివాసరావు

మంగళగిరి (చైతన్యరథం): అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండల కేం ద్రంలో ఉన్న ప్రభుత్వ భూమి 2.83 ఎకరాలను వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రోద్భలంతో అతని మేనమామ, గోపాలపురం మాజీ సర్పంచ్ పద్మనాభరెడ్డిలు ఆక్రమిం చుకున్నారని శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజావినతుల కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌లో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టిం చుకోవడం లేదని కోట చంద్రశేఖర్ వివరించారు. వైసీపీ నేతల భూ కబ్జాపై విచారణ జరిపించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ భవనాల కోసం వినియోగిం చాలని వినతిపత్రం అందజేశాడు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే బడేటి చంట అర్జీలు స్వీకరించారు.

కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన రాజులపూడి ఆరుద్ర సమస్యను వివరిస్తూ ఆస్తుల విషయంలో తమ బంధువులు రాజులపూడి సోమ శేఖర్, భరత్ నుంచి తమకు రక్షణ కల్పించాలని వినతిపత్రం ఇచ్చారు. తమపై దౌర్జన్యానికి దిగిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తన కుమారుడి ఆరోగ్య పరిస్థితి బాగోలేదని.. బ్రెయిన్‌కు ఆక్సిజన్ సరిగ్గా అందక ఇబ్బంది పడుతున్నట్లు డాక్టర్ చెప్పారని పశ్చిమగోదావరి జిల్లా



తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన తేజస్విని ఆవేదన వ్యక్తం చేసింది. దయచేసి తన కుమా రుడి ఆరోగ్యం కోసం సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

తాము పొలం కొనుగోలు చేసి డబ్బులు చెల్లించాక పొలం యజమాని సయ్యద్ జిలాన్ బాషా తమకు పొలాన్ని రిజిస్ట్రేషన్ చేయించకుండా ఇబ్బంది పెడుతున్నాడని కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన ఎస్.సిరాజుద్దీన్ ఫిర్యాదు చేశాడు. దీనిపై కోర్టు తమకు పొలాన్ని రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వాలని సయ్యద్ జిలాన్ బాషాను ఆదేశించినా పట్టిం చుకోవడంలేదని తెలిపాడు. అతనిపై చర్యలు తీసుకుని తమకు పొలాన్ని రిజిస్ట్రేషన్ చేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

వంశధార ప్రాజెక్ట్ కింద తమ ఇల్లు పోయి ఆధారం లేక ఇబ్బంది పడుతున్నామని శ్రీకాకుళం జిల్లా హిరమండలం కొల్లివలస గ్రామానికి చెందిన భవిరి సింహా చలం ఆవేదన వ్యక్తం చేశాడు. కోల్పోయిన ఇంటికి ప్యాకేజీ రాలేదని..రావాల్సిన ప్యాకేజీ ఇప్పించి ఇంటి స్థలాన్ని మంజూరు చేయాలని వేడుకున్నారు.

డ్వాక్రా గ్రూప్ లీడర్ వెలగా అరుణకుమారి, యానిమేటర్ లక్ష్మి తిరుపతమ్మ గ్రూప్ సభ్యులు కట్టిన డబ్బులు సొంత అవసరాలకు వాడుకుని అకౌంట్‌లో జమ చేయ లేదని గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కొలనుకొండ గ్రామానికి చెందిన కేళావత్ రాధ ఫిర్యాదు చేసింది. దీనిపై ప్రశ్నిస్తే మీకు చేతనైంది చేసుకోమని బెదిరిస్తున్నారని తెలిపింది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని..వారికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

తమ తల్లిదండ్రులు ఇద్దరూ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారని.. తమకు ఎవరూ ఆధారం లేరని తన చదువుకు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన పదిలం బస్వంతి (13) అర్జీ ఇచ్చింది.

దేవాలయాల్లో వాయిద్యం వాయిస్తూ పనిచేస్తున్న తమకు దేవాదాయ శాఖ స్థలాల్లో ఇళ్లు ఏర్పాటు చేసుకునేందుకు కొంత స్థలం కేటాయించాలని అనంతపురం జిల్లా శింగనమలకు చెందిన పలువురు నాయి బ్రాహ్మణులు వినతిపత్రం ఇచ్చారు.

బుంగా తిమోతి అనే వ్యక్తి తనకు పోస్టాఫీసులో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి తన వద్ద రూ.6 లక్షలు తీసుకుని మోసం చేశాడని ఎన్టీఆర్ జిల్లా విజయవాడ చిట్టి నగర్‌కు చెందిన కొల్లి దుర్గారావు ఫిర్యాదు చేశాడు. తిమోతిపై చర్యలు తీసుకుని తనకు డబ్బులు ఇప్పించాలని వినతిపత్రం అందజేశాడు.











# దేశ గతిని మార్చిన సంస్కర్త మన్మోహన్

- ఆర్థిక సంస్కరణలతో ముందుకు నడిపారు
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో నేతల నివాళి
- పాల్గొన్న పల్లా శ్రీనివాస్, వర్ల, నాయకులు

మంగళగిరి(చైతన్యరథం): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతితో దేశం గొప్ప ఆర్థిక సంస్కర్తను కోల్పోయిందని దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనం తరం మాట్లాడుతూ దూరదృష్టి తో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి అనేక పదవులను సమర్థవంతంగా నిర్వ హించి దేశానికి సేవలందించారని కొనియాడారు. గతంలో బంగారాన్ని ప్రపంచ బ్యాంకుల్లో తాకట్టు పెట్టి అప్పులు తెచ్చుకునే పరిస్థితి నుంచి ఆర్థిక సంస్కరణలతో కొనుగోలు చేసే స్థాయికి తీసుకెళ్లిన వ్యక్తి అని, ఆయన లేని లోటును ఎవరూ భర్తీ



చేయలేరని తెలిపారు. దేశం గొప్ప వ్యక్తిని కోల్పోయిందంటూ కుటుంబసభ్యులకు ప్రగాఢ సాను భూతి తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థలో మన్మోహన్ తీసుకున్న నిర్ణయాల వల్లే నేడు మనం భారతదేశం పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని తెలిపారు. ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లో అయినా ఒడి దుడుకులను ఎదుర్కొంటూ ఎలా ముందుకు వెళ్లాలో ఆయన జీవితమే ఉదాహరణ అన్నారు. కష్టపడి ఉన్నత చదువులు చదివి లెక్చరర్‌గా జీవిత ప్రయాణాన్ని మొదలు పెట్టి ప్రొఫెసర్‌గా, అకడమిక్ అడ్వయిజర్‌గా, ఆర్బీఐ గవర్నర్‌గా, ప్రణాళికా సంఘం డిప్యూటీ ఛైర్మన్‌గా, యూజీసీ ఛైర్మన్‌గా ఎన్నో ఉన్నతమైన పదవులకు గౌరవం తెచ్చా రని తెలిపారు. ఎమ్మెల్సీ అశోక్‌బాబు మాట్లాడుతూ 1991లో ఆర్థిక మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మన్మోహన్ ప్రపంచంలోనే 5వ ఆర్థిక వ్యవస్థగా భారతదేశాన్ని నిలిపి ఓ శక్తిగా మార్చారని పేర్కొన్నారు. దేశ ఆర్థికమంత్రిగా ఎంతో దూర దృష్టితో సంస్కరణలకు బాటలు వేశారని ప్రశంసించా రు. దేశానికి దిశ, దశ నిర్దేశించి ప్రపంచ పటంపై భారత్‌ను మేటి దేశంగా నిలిపి ఖ్యాతి గడించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, టీడీ జనార్దన్, ఎమ్మెల్యే బడేటి చంటి, బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్ర,ఎన్ఆర్ఐ విభాగం చప్పిడి రాజశేఖర్, సీనియర్ నాయకులు ఎ.వి.రమణ, ఆళ్ల వెంకట గోపాలకృష్ణ,డి.శంకర్‌నాయుడు పాల్గొన్నారు.

# రిషికొండ బీచ్ తరహాలో యారాడ బీచ్‌ను అభివృద్ధి చేస్తాం



విశాఖపట్నం (చైతన్యరథం): మూడు రోజుల విశాఖపట్నం పర్యటనలో భాగంగా శనివారం యారాడ బీచ్‌ని, అక్కడ ఉన్న ఏపీటీడీసీ రెస్టారెంట్‌ని ఏపీ టీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ సందర్శించారు. పర్యాటకులతో మాట్లాడి వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. టూరిస్టులకు అందిస్తున్న ఫుడ్‌ను పరిశీలించారు. రుచికరమైన భోజనాన్ని అందిస్తున్నారని టూరిస్టులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. వాష్ రూమ్, డ్రెస్సింగ్ రూమ్స్ ఏర్పాటు, ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం, రోడ్డు అలైన్మెంట్ మార్చడం, కొత్త రూమ్స్ కట్టటం వంటి మరిన్ని సదుపాయాలు కల్పించాల్సి ఉందని చైర్మన్ తెలిపారు. యారాడ బీచ్‌కి పక్కనే వున్న 105 ఎకరాల అగ్రిగోల్డ్ ల్యాండ్స్ పర్యాటక సంస్థ కొరకు తీసుకొని రిసార్ట్స్, రెస్టారెంట్స్, రూమ్స్ నిర్మాణం చేసి యారాడ బీచ్‌ని అద్భుత సుందర ప్రదేశంగా తయారు చేసుకోవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. పర్యాటకులు ఎక్కువగా యారాడ బీచ్‌ను సందర్శిస్తున్నారని, యారాడ బీచ్‌ని కూడా ఆర్కే బీచ్, రిషికొండ బీచ్ మాదిరిగా బ్లూ ఫ్లాగ్ స్టాండర్డ్స్‌తో అభివృద్ధి చేస్తామన్నారు. ఆర్కే బీచ్ వద్ద టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌ను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. స్థానిక కొండపై టీటీడీ నిర్మించిన శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని టూరిస్ట్ లోకల్ సర్క్యూట్‌లో భాగం చేస్తామన్నారు. అనంతరం మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానాన్ని, ఫిషింగ్ హార్బర్‌లో ఉన్న బోటింగ్ యూనిట్‌ను సందర్శించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు బోటింగ్ చేయటం సంతోషంగా ఉందని, త్వరలో సౌకర్యవంతమైన బోట్లతో బోటింగ్సు అప్‌గ్రేడ్ చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి ఎంతో ముందు చూపుతో రూపొందించిన నూతన టూరిజం పాలసీని అనుసరించి, కొత్త కొత్త పర్యాటక ప్రదేశాలను గుర్తించడం, కొన్ని సంస్థ ఆధ్వర్యంలో మరికొన్ని ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో నూతన పర్యాటక యూనిట్లు ఏర్పాటు చేస్తామని, ఉన్న వాటిని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ పర్యటనలో చైర్మన్ వెంట ఏపీటీడీసీ అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యక్రమాలపై సమీక్షా సమావేశం




విజయనగరం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఇరవై సూత్రాల కార్యక్రమం కమిటీ చైర్మన్ లంకా దినకర్ శనివారంవిజయనగరం కలెక్టరేట్లో జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులతో ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలపై ఆయన కలెక్టర్ అంబేద్కర్తో పాటు జిల్లా అధికారులతో మాట్లాడారు. ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి రాజు,ఎం.ఎల్.సి. రఘు రాజు, మహిళా ఆర్థిక సహకార సంస్థ చైర్ పర్సన్ కావలి గ్రీష్మ, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారు రాజు,ఆర్.టి.సి ప్రాంతీయ చైర్మన్ దున్ను దొర, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్విని, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# యువత క్రీడల్లో రాణించాలి : ఎమ్మెల్యే కూనరవికుమార్



అముదాలవలస (చైతన్యరథం): సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న ఉపాధి అవకాశాల పోటీల్లో ఎంతో ప్రాధాన్యం కలిగిన క్రీడల్లో యువత రాణించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం విజయవాడలో శాప్ చైర్మన్ ఎ.రావినాయుడు ఆధ్వర్యంలో నిర్వ హించిన సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన రవికుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ అభివృద్ధితో పాటు పరిశ్రమలను స్థాపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ సీఈవో సి.వెంకటేషులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎంవీ రమణ, ట్రెజరర్ నర్సింరెడ్డి, ఏపీపీఈటీ సంఘం గౌరవ అధ్యక్షుడు కరిముల్లా చౌదరి, కార్యదర్శి సి.నాగేంద్ర పాల్గొన్నారు.

# నష్టపోయిన ప్రతిరైతును ఆదుకుంటాం : తోయక జగదీశ్వరి



కురుపాం (చైతన్యరథం): ఏనుగుల కారణంగా నష్టాలబారిన పడిన బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి భరోసా ఇచ్చారు. మండలంలోని సుంకి ప్రాంతంలో ఏనుగుల కారణంగా పాడైన పంటలను ఆమె శుక్రవారం పరిశీలించారు. అనంతరం బాధిత రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడు తూ సుంకి పరిధిలో గత వారం రోజులుగా గజరాజుల గుంపు సంచరిస్తోందని, అధికంగా వరి, అరటితో పాటు పలు రకాల పంటలు ధ్వంసమయ్యాయన్నారు. పంట నష్టాలను నమోదు చేసి అంచనా వేయాలని అటవీ శాఖ అధికారులకు సూచించారు. సంబంధిత సమస్యలపై జిల్లా అటవీ అధికారికి ఫోన్‌లో అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. పరిహారం విషయంలో జాప్యం నెలకొన కుండా త్వరితగతిన అందించేలా కృషి చేయాలన్నారు. కురుపాం నియోజకవర్గం లో ఏనుగుల కారణంగా జరుగుతున్న నష్టాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల దృష్టికి తీసుకువెళ్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలోని ఏనుగుల గుంపును తరలించేందుకు కర్ణాటక రాష్ట్రం నుంచి కుంకి ఏనుగులను తెప్పించే చర్యలు జరుగుతున్నాయన్నారు. అలాగే తుఫాన్ కారణంగా నష్టం వాటిల్లిన పంటల వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానని చెప్పారు.

# దళారులను నమ్మి కాఫీ రైతులు నష్టపోవద్దు

- జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ సూచన



అరకు (చైతన్యరథం): అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం ఎగువ శోభ పంచాయతీలోని మర్రగూడ, బీసుపురం తదితర ప్రాంతాల్లో మాజీమంత్రి జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ శనివారం పర్యటించారు. ఎగువ శోభ పంచాయతీ బీసుపురం మర్రగూడ గ్రామాల్లో పర్యటించి రైతులతో సమావేశమై కాఫీ దిగుబడి చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. గిరిజనులు పండిస్తున్న కాఫీ పంటలకు కచ్చితంగా గిట్టుబాటు ధర కల్పిస్తామని కేజీ 320 రూపాయలు చెల్లిస్తామని, చెర్రీ రకానికి 170 రూపాయలు చెల్లిస్తామని, రోపేస్టాకు 100 రూపాయలు చెల్లిస్తామని తెలిపారు. కాఫీ రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అరకు కాఫీకి ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. కాఫీ పంట వేసే రైతులకు అధిక ఆదాయం వచ్చేలా తాను చూస్తానని, రైతులు కాఫీ పంట దిగుబడులపై దృష్టిపెట్టాలని కోరారు. రైతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. దళారి వ్యక్తులను నమ్మి రైతులు మోసపోవద్దని, దళారులు కాఫీ రైతులకు మోసం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. 1500 నుండి 2000 మెట్రిక్ టన్నులు కాఫీ పంట కొనుగోలే లక్ష్యంగా పనిచేస్తున్నామని, జీసీసీ ఉద్యోగస్తులు కాఫీ రైతుల వద్దకే వెళ్లి పంటను కొనుగోలు చేయాలన్నారు. రైతులకు జీసీసీ సంస్థపై నమ్మకం కలిగేలా ఉద్యోగులు నడుచుకోవాలని సూచించారు. ప్రతి కాఫీ రైతుకు మన మద్దతు ధర తెలిసేలా ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జీసీసీ కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్, జీసీసీ సిబ్బంది, తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు బుజ్జిబాబు, ప్రధాన కార్యదర్శి ఆనందరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ నిర్మల జోగులు, యూనిట్ ఇన్‌ఛార్జులు లక్ష్మణరావు, నరేంద్ర దొన్ను, టీడీపీ నాయకులు శివరంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# నారా భువనేశ్వరిని కలిసి ఎంపీ కలిశెట్టి



విజయనగరం (చైతన్యరథం): విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబ సమేతంగా శనివారం హైదరాబాదు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిని కలిశారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా పేద ప్రజలు పేద విద్యార్థులకు అందిస్తున్న సేవలు చారిత్రాత్మక నిలుస్తున్నాయని ఎంపీ అప్పలనాయుడు భువనేశ్వరికి వివరించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా లక్షలాది మంది ప్రజలకు వివిధ రూపాల్లో సహాయం అందించడం అభినందనీయమని కలిశెట్టి చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కష్టపడి పని చేస్తున్నారని ప్రజలకు మంచి పరిపాలన అందిస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుతున్నానని ఆయన భువనేశ్వరికి వివరించారు.

# ఎంపీడీఓ అధికారులతో ఎమ్మెల్యే భేటీ



పోలవరం (చైతన్యరథం): పోలవరం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే సిరి బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రతి గ్రామం అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఉన్నట్లు ఆయన తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పనులు నాణ్యతను పరిశీలించాలన్నారు. పోలవరంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం అన్ని మండలాలు కంటే ఎక్కువగా రావాలని మండల విద్యాశాఖ అధికారిని అదే ఆదేశించారు. నీటిపారుదల శాఖ అధికారులు తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గృహ నిర్మాణ శాఖ లబ్ధిదారుల వివరాలు త్వరగా పూర్తి చేసి అందజేయాలన్నారు.

# పదిసార్లు విద్యుత్‌ఛార్జీలు పెంచిన జగన్

## ● రూ.1,29,000 కోట్ల భారం వేసి ఇప్పుడు డ్రామాలా?: ముప్పిడి



కొవ్వూరు : (చైతన్యరథం): విద్యుత్ ఛార్జీల పెంపు పాపం ముమ్మాటికి జగదేనని, అతని అవినీతి వల్లె విద్యుత్ భారాలు పెరిగాయని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు వ్యాఖ్యానించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఐదేళ్ల వైసీపీ పాలనలో పదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి రూ.1,29,000 కోట్ల భారం వేసి ఇప్పుడు డ్రామాలు ఆడటం దారుణమని అన్నారు. జగన్ రెడ్డి పాలనలో మైలవరం సోలార్ ప్లాంట్లపై దాడిచేసి ధ్వంసం చేశారు. చట్టవిరుద్ధంగా పీపీఏలను రద్దు చేయడం వల్ల 7 వేల మెగావాట్లు తక్కువ రేటుకు వచ్చే విద్యుత్ ఉత్పత్తి కోల్పోవడం జరిగింది. అలా కాకుండా వారిని ప్రోత్సహించి ఉంటే వారి అనుభవంతో మరో 10 వేల మె.వా ప్లాంట్లను ఈపాటికే ఉత్పత్తిలోకి తెచ్చి ఉండేవారు. దీని వల్ల రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో యువతకు ఉద్యోగాలు రావడమే కాకుండా రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉండేదన్నారు. పోలవరం జలవిద్యుత్ కేంద్రం 2021కే పూర్తి చేయకపోవడం వల్ల రూ.4,737కోట్ల నష్టం జరిగింది. జెన్‌కో విద్యుత్ ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి తగ్గిపోవడానికి విజయసాయిరెడ్డి సరఫరా చేసిన నాసిరకం బొగ్గు కారణమని మండిపడ్డారు. నాణ్యమైన బొగ్గు తగినంత నిల్వ పెట్టుకోనందుకు విద్యుత్ ఉత్పత్తి తగ్గింది. విద్యుత్ సంస్థలపై 49 వేల కోట్లకు పైగా అప్పు చేసినా ఒక కొత్త విద్యుత్ ప్లాంటును నిర్మించలేదు. నిర్మాణం పూర్తి అయి విద్యుత్ ఉత్పత్తికి సిద్ధంగా ఉన్న కృష్ణపట్నం, వీటీపీఎస్‌లను సకాలంలో ప్రారంభించలేదు. దీన్ని కారణంగా చూపి విద్యుత్ కొరతను కావాలని సృష్టించి కమిషన్ల కోసం బహిరంగ మార్కెట్లో అధిక రేట్లకు విద్యుత్ను కొనుగోలు చేయడం వల్ల రూ.2700 కోట్లు నష్టం వచ్చింది. ట్రాన్స్ ఫార్మర్లు, స్మార్ట్ మీటర్లు లాంటి విద్యుత్ పరికరాలను కమిషన్లకోసం అధికరేట్లకు కొనుగోలు చేయడం వల్ల వేల కోట్ల నష్టం వచ్చింది. కూకట్‌పల్లిలో హిందూజలకు చెందిన 10 ఎకరాలు జగన్ బినామీలు కొట్టేసి అందుకు బదులుగా విద్యుత్ ఉత్పత్తి చేయకపోయినా, ఈఆర్సీ వద్దన్నా.. రూ.1400 కోట్లు హిందుజలకు ధారాదత్తం చేశారు. అధిక వడ్డీ రేట్ల వల్ల రూ.10,892 కోట్లు నష్టం వచ్చింది. సెకి ఒప్పందంలో జగన్ రూ.1750 కోట్లు లంచాలు పుచ్చుకున్నారని అమెరికా కోర్టులో కేసు నమోదు అయ్యింది. ఈ సెకి ఒప్పందం వల్ల విద్యుత్ సంస్థలకు ఏడాదికి రూ.3,850 కోట్లు మొత్తం 30 ఏళ్లకు లక్ష కోట్లు వినియోగదారులపై భారాలు మోపారు. ఇలా జగనే విద్యుత్ చార్జీలు పెంచి ఆయనే ధర్నాలు చేయడం ప్రజలను మోసగించడమే. నేడు రాష్ట్రంలో 20 వేల మెగా వాట్ల విద్యుత్ సామర్థ్యం గల విద్యుత్ ప్లాంట్లు చంద్రబాబు పాలనలో నిర్మించినవే. కాబట్టే రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వగలుగుతున్నాం. అలాగే ఎస్సీ,ఎస్టీ, కొన్ని బీసీ కులవృత్తిదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వగలుగుతున్నాని, ఆక్వా రైతులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ ఇవ్వగలు గుతున్నామని ముప్పిడి వెంకటేశ్వరరావు వ్యాఖ్యానించారు.

# చెత్త పాలనతో రాష్టాన్ని సర్వనాశనం చేసిన జగన్

## ●అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల అనందరావు




అమలాపురం (చైతన్యరథం): గత చెత్త పాలన గాడిలో పెట్టెందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రయత్నం చేస్తుంటే జగన్‌రెడ్డి విషం చిమ్ముతున్నారని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల అనందరావు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, పట్టణ అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీలు పాల్గొన్నారు. 2019-24 మధ్య చేసిన పాపాలు ఫలితమే నేడు పెంపుదల అని అన్నారు. ఆరు నెలల్లో విద్యుత్ చార్జీలపై అందోళన చేయడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. మిగులు విద్యుత్ చంద్రబాబు అందిస్తే... జగన్ రూ. 1,09,000 కోట్లు భారం ప్రజలపై వేశారని అన్నారు. రూ.32,000 వేలకోట్లు ఛార్జీలు పెంపుతో పాటు రూ.49,500 కోట్లు అప్పులు చేశారని అన్నారు. తాను చేసిన అవినీతిని మర్చిపోయిన జగన్... ఆత్మపరిశీలన చేసుకోవడం మానేసి సత్యలు చెబుతూ ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. చెత్తపై పన్ను వేసి చెత్తపాలన అందించిన జగన్‌ను లెవెన్‌రెడ్డి అని ప్రజలు అంటున్నారని అన్నారు. జగన్ నిర్వహకంతో రూ.618 కోట్ల మేర విద్యుత్ సంస్థలకు నష్టం వాటిల్లిందని, రూ.1,29,300 కోట్లు నష్టం జగన్ ఐదేళ్ల పరిపాలనలో జరిగిందన్నారు.

# విద్యుత్ ఛార్జీల భారం ముమ్మాటికి జగన్ పాపమే

## ● మండిపడ్డ ఎమ్మెల్యే సత్యానందరావు



కొత్తపేట (చైతన్యరథం): మాజీ ముఖ్యమంత్రి జగన్ నాడుచేసిన అవినీతి విద్యుత్తు వ్యవస్థను నాశనం చేయడమే కాక ప్రజలపై ఛార్జీల భారం మోపారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. వాడపాలెం కార్యాలయం జరిగిన పాత్రికేయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్ అవినీతి,అసమర్థతతో లక్షా ఇరవై తొమ్మిది వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని ఆరోపించారు.గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ (పీ పీ ఏ) ద్వారా 25 సంవత్సరాలకు యూనిట్ విద్యుత్తు ధర 4.86 రూపాయలకు సరఫరా చేసేలా ఒప్పందం చేసుకుంటే దాన్ని నిర్వీర్యం చేసి జగన్ అవినీతి కోసం కొత్త దారులు తొక్కారని అన్నారు.గత జగన్ ప్రభుత్వ హయాంలో ఎనిమిది సార్లు పైగా విద్యుత్ చార్జీలు పెంచారని గుర్తు చేశారు.2019-14 లో వినియోగదారులపై విద్యుత్తు చార్జీల భారం 32 వేల 166 కోట్ల రూపాయల భారం పడిందని చెప్పారు.విద్యుత్తు సంస్థలపై పెరిగిన అప్పులు 49 వేల 596 కోట్ల రూపాయల అప్పులు పెరిగాయని తెలిపారు.జగన్ అవినీతి అసమర్థతతో వీటీపీ ఎస్,కృష్ణపట్నం థర్మత్ ప్లాంటు ఏర్పాటులో జాప్యంతో 12 వేల 818 కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందన్నారు.పోలవరం హైడ్రా ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ జాప్యంతో 4 వేల 737 కోట్ల రూపాయల నష్టం జరిగిందన్నారు.స్వలపకాలిక విద్యుత్తు కొనుగోళ్ల వల్ల 2 వేల 691 కోట్ల నష్టం అని ఏడాదికి 7 వేల మెగావాట్ల సోలార్ పవర్ (సెకీ) 3 వందల 85 కోట్ల రూపాయల నష్టం వచ్చిందన్నారు.అప్పులపై వడ్డీ భారం 10 వేల 892 కోట్ల రూపాయల నష్టమన్నారు.ఏపీ డిస్కంలు,ఏపీపిడీసిఎల్ నిర్వహణ వైఫల్యంతో 9 వేల 618 కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని తెలిపారు. జెన్‌కో విద్యుత్ ప్లాంట్ లో విద్యుత్ ఉత్పత్తి తగ్గించడం వల్ల 3 వేల 135 కోట్ల రూపాయల నష్టం జరిగిందని సత్యానందరావు అన్నారు. పిర్రగిల్లి జోలపాడినట్లుగా జగన్ తీరు అవినీతి చేసి ఆ పాపాన్ని జనం నెత్తిన వేసిన జగన్... నేడు కూటమి ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును నిందించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పిర్రగిల్లి జోలపాడినట్లుగా జగన్ తీరు ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు దోపిడే లక్ష్యంగా ప్రజల్ని దోచుకున్న జగన్... నేడు రోడ్లక్కి అరిచి గోల చేసినా, ధర్నాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. విద్యుత్ ఛార్జీలు భారం జగన్ పాపమేనని ప్రజలకు తెలుసునని ఎమ్మెల్యే సత్యానందరావు అన్నారు. ఈ సమావేశంలో కంఠంశెట్టి శ్రీనివాస్, ముత్యాల బాబ్జీ, పల్లికుమార్‌రాజా(ఏసు), పెచ్చెట్టి చిన్నారావు, బీర ఇసాక్, బండారు వీరబాబు, నాగిరెడ్డి సత్యనారాయణ, దూనబోయిన నారాయణ, ఐరెడ్డి రామారావు, సురవరపు రాంపండు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వ్యవస్థలను జగన్ నిర్వీర్యం చేశారు : గోరంట్ల




రాజమహేంద్రవరం (చైతన్యరథం): వైసీపీ తప్పుడు విధానాల వల్ల విద్యుత్ చార్జీలు పెరిగాయని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆక్షేపించారు. జగన్ హయాంలో నాసిరకం బొగ్గు కొనుగోలు చేయటం వల్ల ఉత్పత్తి తగ్గిపోతే అధిక ధరలకు కరెంట్ కొన్నారని అన్నారు. విద్యుత్ ఛార్జీలపై వైసీపీ నేతలు ధర్నాలు చేసేందుకు సిగ్గుపడాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను అధిక రేట్లకు కొనుగోలు చేశారని ఆరోపించారు. శనివారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి రాజమండ్రిలో పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... జగన్ నియంతలా ఏపీని పరిపాలించారని అన్నారు. జగన్ ఐదేళ్లలో అభివృద్ధి పనులు ఏమీ చేయలేదని మండిపడ్డారు. అన్ని వ్యవస్థలను జగన్ నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. రాబోయే రోజుల్లో కరెంట్ చార్జీలు తగ్గిస్తామని తెలిపారు. జగన్ తీరు వల్ల పరిశ్రమలు మూతపడ్డాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెంచిన పింఛన్లు అందజేశామని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు నెలల్లోనే ఉద్యోగ నియామకాలకు శ్రీకారం చుట్టిందని అన్నారు. సోలార్ విద్యుత్ కోసం జగన్ ముడుపులు తీసుకున్నారని ఆరోపించారు. జగన్ పాలనలో జరిగిన భూముల దోపిడీపై విచారణ జరుగుతుందని అన్నారు. వైసీపీ అక్రమాల వల్లే కూటమి నేతలను ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించారని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు.

# పట్టాభూములను గ్రామ కంఠం భూములతో కలిపడం దారుణం



ముదినేపల్లి (చైతన్యరథం): లోపభూయిష్టమైన సర్వే కారణంగా పలు గ్రామాల్లో తప్పులు దొర్లాయని, వాటిని సరిచేసేందుకు స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళుతున్నామని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా తెలిపారు. జనవరి 8 వరకు రాష్ట్రవ్యాప్తంగా 17,600 రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని.. ఇంకా అర్జీలు ఉంటే సమయం పొడిగిస్తామని వెల్లడించారు. పెదపాలపర్రులో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన ప్రత్యేకంగా హాజరై మాట్లాడారు. వాస్తవ పరిస్థితులకు భిన్నంగా పలుచోట్ల భూములను 22ఏలో పేర్కొన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, వాటిని తప్పనిసరిగా సరిచేస్తామని వివరించారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని వైవాక భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. కొల్లేటి భూముల విషయంలో స్థానికుల ఆందోళన గుర్తించాలన్నారు. గ్రామస్థులు పలువురు తమ సమస్యలను సిసోడియా దృష్టికి తీసుకువచ్చారు. గత ప్రభుత్వ కాలంలో చేపట్టిన రీ సర్వే కారణంగా పలు భూములకు సంయుక్త ఎల్పీఎంలు జారీ చేశారని ఫలితంగా భూ యజమానుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టాభూములను గ్రామ కంఠం భూములతో కలిపి వేయడం వల్ల ఇబ్బందులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జేసీ ధాత్రిరెడ్డి, ఆర్డీవో అంబరీశ్, తహసీల్దారు సుభానీ, ఎంపీడీవో వై. రామకృష్ణ, ఏలూరు డీఐఓఎస్ రమణ, మండల సర్వేయర్ రాజశేఖర్రెడ్డి, గుడివాడ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శోభనాద్రి చౌదరి, సర్పంచి గంటా రాకేశ్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ వర్గీయులపై వైసీపీ కార్యకర్తల దాడి

ఏలూరు (చైతన్యరథం): కామవరపుకోట మండలం జలపా వారి గూడెంలో టీడీపీ నాయకులపై వైసీపీ వర్గీయుల దాడి జరిగింది. వైసీపీ నాయకుడు కరుటూరి బాలస్వామి ఆధ్వర్యంలో సుమారు పదిమంది కర్రలు, కత్తులతో టీడీపీ నాయకులు కొలకలూరి రాంబాబు, సోమయ్య రవిలపై దాడి చేశారు. భూ వివాదాల నేపథ్యంలో కొంతకాలంగా ఇరువర్గాలకు గొడవలు జరగుతున్నాయి. ఇప్పటికే రెండు వర్గాలపై తడికలపూడి పోలిస్ స్టేషన్లో కేసులు నమోదయ్యాయి.



# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన కొలికపూడి



తిరువూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మూడువ విడత ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు శనివారం పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు మూడు విడతల్లో ఒక కోటి రూపాయలు వరకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేయడం జరిగిందని ఈ సందర్భంగా కొలికపూడి శ్రీనివాసరావు తెలియజేశారు. సీఎం సహాయనిధి ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని కొలికపూడి వ్యాఖ్యానించారు.

# అన్నార్తుల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు

- కూటమి ప్రభుత్వం రాకతో అన్నక్యాంటీన్లకు జవసత్వాలు
- ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ (చైతన్యరథం): అన్నార్తుల ఆకలి తీర్చడానికి అన్న క్యాంటీన్లు ఎంతో ఉపయోగపడుతున్నాయి. పేదల ఆకలి తీర్చేం దుకు అన్న క్యాంటీన్లు మళ్లీ తెరచుకోవ డంతో సర్వత్ర హర్షం వ్యక్తమవుతోందని ఏపీ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. శనివారం నందిగామ పట్టణంలోని అన్న క్యాంటీన్ సందర్శించారు. నల్లాని బల్లెమ్మ వర్ధంతిని పురస్కరించుకొని వారి కుమారులు రామ్మోహన్, రవికుమార్‌లు అన్న క్యాంటీన్లో అన్నదానం చేయడం పట్ల సౌమ్య వారిని అభినందించారు. నాయకులు కార్యకర్తలు వారి పుట్టినరోజులు వివిధ శుభకార్యాలు జరుపుకొని సందర్భంలో ఈ విధంగా అన్న క్యాంటీన్లో అన్న సమారాధనకు సహకరిస్తున్న దాతలందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ అన్న క్యాంటీన్లను మూసి వేశారని , అయితే రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టగానే అన్నక్యాంటీన్ల వ్యవస్థను పునఃప్రారంభించిందన్నారు. అన్నక్యాంటిన్లు అందుబాటులోకి రావడంతో పేద, సామాన్య తరగతి ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోందన్నారు. పేదలకు మూడుపూటలా రుచికరమైన భోజనం అందిఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో అన్నక్యాంటీన్లు మూసివేసినా టీడీపీ నేతలు స్వచ్ఛం దంగా గత ఐదేళ్లగా వాటిని నడిపి పేద వర్గాల ఆకలి తీర్చారు. పేదల కడుపు నింపుతున్న అన్నక్యాంటీన్లకు పూటపూటకు ప్రజాదరణ పెరుగుతూ వస్తోందన్నారు. నియోజకవర్గ కేంద్రానికి వివిధ సమస్యలు తెలపడానికి వచ్చే పేదలకు అన్న క్యాంటిన భోజనంతో ఆర్థికంగా కొంత వెసులుబాటు కలుగుతోందన్నారు. అనంతరం తంగిరాల సౌమ్య స్థానిక కూటమి నేతలతో కలిసి రైతు బజారును సందర్శించారు. ధరలను అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా సాధారణ ధరలకే విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతు బజార్లలో కూరగాయలు విక్రయించే ధరల పట్టిక తప్పని సరిగా ఏర్పాటు చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

# విద్యుత్ భారాల పాపం జగన్ రెడ్డిదే : సాయిరాం గౌడ్




విజయవాడ (చైతన్యరథం) : విద్యుత్ భారాల పాపం జగన్‌రెడ్డిదేనని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ మండిపడ్డారు. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో కమిషన్‌ల కోసం, అవినీతి సొమ్ము కోసం చేయాల్సిన తప్పుడు పనులన్ని చేసి... ఇప్పుడు వైసీపీ నాయకులతో కలిసి రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచనని అధికారంలోకి వచ్చిన జగన్... ఐదేళ్లలో తొమ్మిదిసార్లు విద్యుత్ భారాలు ప్రజలపై వేశారని అన్నారు. జగన్‌రెడ్డి హయాంలో సెబి ద్వారా గుజరాత్‌లో 1.99 పైసలు యూనిట్ ఉంటే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం అధిక రేటుకి 2.59 పైసలకు, ట్రాన్స్ మిషన్ చార్జీతో కలిపి 4.50 పైసలు ఒక్కో యూనిట్ ప్రజల నెత్తిన భారం మోపారని అన్నారు. కమిషన్లకు కక్కుర్తిపడి రూ.1750 కోట్ల మేర లంచాలు తీసుకున్న జగన్‌పై అమెరికాలోని ఎఫ్‌బీఐ సంస్థ కేసు పెట్టడం నిజం కాదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వంలో డిస్కంలో కాంట్రాక్టు కుదుర్చుకుంటే ఆ కాంట్రాక్ట్‌ను కూడా విస్మరించి, కాంట్రాక్టు దగ్గర నుండి విద్యుత్ తీసుకోకపోవడం వల్ల రాష్ట్ర ఖజానా నుండి కాంట్రాక్టు సొమ్ము చెల్లించాల్సి వచ్చిందన్నారు. అధిక ధరలకు కొని ప్రజలపై భారం మోపిన పాపం జగన్‌రెడ్డికే దక్కిందన్నారు. జగన్‌రెడ్డి అధికారం నుంచి పోతూపోతూ కూడా ప్రజలపై భారం మోపారని, ట్రూఅప్ చార్జీల భారం ముమ్మాటికి జగన్‌దేనన్నారు. ఐదేళ్లపాలనలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసి, రాష్ట్రాన్ని 20 సంవత్సరాలు వెనక్కి నెట్టారని మండిపడ్డారు. జగన్‌రెడ్డి అవినీతి సొమ్ము కోసం తన ఖజానాను నింపుకోవడం కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని మండిపడ్డారు. చేయాల్సిన తప్పులన్ని గత ఐదు సంవత్సరాల్లో జగన్‌రెడ్డి చేసి, సిగ్గు లేకుండా ఇప్పుడు తమ పార్టీ నాయకులతో కూటమి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నాడని సాయిరాం గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కార్మికుల శ్రేయస్సే తెలుగునాడు ధ్యేయం

మచిలీపట్నం (చైతన్యరథం): కార్మికుల శ్రేయస్సే ధ్యేయంగా అనేక సేవలు అందిస్తూ తెలుగునాడు విద్యుత్తు కార్మిక సంఘం దిగ్విజయంగా కొనసాగుతోందని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. మచిలీపట్నంలోని ఓ వేడుక మందిరంలో తెలుగు వికాస డైరీ-2025 ఆవిష్కరణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ 1983లో ప్రారంభమైన కార్మిక సంఘం అనేక పోరాటాలు చేయడంతోపాటు ఎన్నో విజయాలు సాధించి తన ప్రత్యేకతను చాటుకుంటోందన్నారు. పెడన ఎమ్మెల్యే కాగిత వెంకట్రావు, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, మాజీ మంత్రి ఆలపాటి రాజా, టీఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టి ముక్కల రఘురామకృష్ణంరాజు, తెలుగునాడు విద్యుత్తు కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతనేని సాంబశివరావు, పాలడుగు సుగుణాకరరావు, కేతు మధుసూదనరెడ్డి, మోటుపల్లి శ్రీరామ్మూర్తి, కోగంటి వెంకటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు. మచిలీపట్నం సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి లింగం రాజేంద్రప్రసాద్, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. అనంతరం దైనందిని ఆవిష్కరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం

- జాబ్ మేళా ద్వారా జిల్లాలో లక్ష మంది యువతకు ఉద్యోగాలు
- జనవరి 5వ తేదిన ఎంఎస్ఎంఈపై అవగాహన సదస్సు
- ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడి




విజయవాడ (చైతన్యరథం): అభివృద్ధిలో వెనుకబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముందు చూపు కలిగిన నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండడం రాష్ట్ర ప్రజల అదృష్టమని, రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలు నిరుద్యోగ యువత నిర్వీర్యంగా మారాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ వ్యాఖ్యానించారు. ఆరు నెలల ఎన్డీయే కూటమి పాలనలో టీసీఎస్, రిలయన్స్, గూగుల్, జిందాల్ వంటి మల్టీ నేషనల్ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి లక్షలాది ఉద్యోగ అవకాశాలు కల్పించేలా సీఎం చంద్రబాబు తీసుకున్నారని అన్నారు. రాబోయే కాలంలో అమరావతి సర్వీస్ సెక్టార్‌గా రూపాంతరం చెందబోతుందని శివనాథ్ తెలిపారు. వికసిత్ భారత్ మెగా జాబ్ మేళా కార్యక్రమంలో భాగంగా శనివారం విజయవాడ పీబీ సిద్దార్ధ పబ్లిక్ స్కూల్ నందు నిర్వహించిన మెగా జాబ్ మేళాను కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, శాసన సభ్యులు గద్దె రామ్మోహన్, బోండా ఉమా మహేశ్వరరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... ప్రతి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశం కల్పించాలానే లక్ష్యంతో వికసిత్ భారత్ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళా ద్వారా నిరుద్యోగ యువతకు కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని, ఉద్యోగం పొందడంతో పాటు మరొకరికి ఉద్యోగ అవకాశం కల్పించే స్థాయికి యువత ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గం కేంద్రంలో జాబ్ మేళాలు నిర్వహిస్తామని యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దెందుకు జనవరి 5వ తేదిన ఎంఎస్ఎంఈ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ... రాష్ట్రంలో రానున్న ఐదు సంవత్సరాలలో 25 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించి పేదరికాన్ని నిర్మూలించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచన చేస్తున్నారన్నారు. పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ లు జిల్లాలో మెగా జాబ్ మేళాలను నిర్వహించి రాబోయే రోజులలో 20 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలనే తీసుకున్న చొరవ అభినందనీయమన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసన సభ్యులు బోండా ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ... చిన్నచిన్న ఇబ్బందులను అధిగమించి పట్టుదలతో పనిచేస్తే ఉన్నత స్థాయికి ఎదగగలుగుతారన్నారు. జీవితంలో ఏదైనా సాధించాలనే లక్ష్యాన్ని పెట్టుకుని చిరుద్యోగిగా ప్రస్థానాన్ని మొదలు పెట్టి పారిశ్రామికవేత్తలుగా ఎదిగిన వారిని ఆదర్శంగా తీసుకుని ఆర్థికంగా స్థిరపడేందుకు యువత కృషి చేయాలన్నారు. ప్రముఖ కంపెనీలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఉద్యోగ అవకాశాలను కల్పించడం గొప్ప విషయమని యువతకు ఇదొక మంచి అవకాశమన్నారు.

# సంశెట్టి చిట్టిబాబును అభినందించిన యార్లగడ్డ

గన్నవరం (చైతన్యరథం): కంప్యూటర్ కీబోర్డ్‌పై “ఏ నుంచి జడ్” వరకు ఉన్న ఆంగ్ల అక్షరాలను ఆల్ఫాబెట్ ఆర్డర్లో వెనుక నుంచి ముందుకు అత్యంత వేగంగా టైప్ చేసి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషన్లో స్థానం సాధించిన గన్నవరం గ్రామానికి చెందిన సంగిశెట్టి చిట్టిబాబు ను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్ అభినందించారు. గన్నవరం క్యాంపు కార్యాలయంలో చిట్టిబాబును శాలువాతో సత్కరించారు. ఉద్యోగిగా పనిచేస్తూనే తనకు ఇష్టమైన రంగంలో కూడా రాణించి అవార్డులు సాధించడం అభినందనీయమని అన్నారు. 2012లో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ కూడా సాధించి ఇప్పుడు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషన్లో స్థానం సాధించడం ఆయన కృషి, పట్టుదలకు నిదర్శనమన్నారు. భవిష్యత్ లో కూడా ఇదే స్ఫూర్తితో రాణించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కూడా సాధించి గన్నవరం నియోజకవర్గానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సంగిశెట్టి చిట్టిబాబు వంటి వారిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.



చైతన్యరథం

# విద్యతోనే ఉజ్వల భవిత

- పేదలకు కూటమి ప్రభుత్వం పెద్ద పీట
- ఎంజేపీ బాలుర పాఠశాల ఆకస్మిక తనిఖీ
- వసతులపై మంత్రి సవిత ఆరా

తిరుపతి (చైతన్యరథం): చంద్రగిరి నియోజకవర్గం చంద్రగిరి మండలం ఐతేపల్లిలోని ఎంజేపీ బాలుర పాఠశాలను రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని అన్ని గదులను మంత్రి పరిశీలించారు. విద్యార్థులను కలిసి ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును ఆరా తీశారు. హాస్టల్ లోని భోజన సదుపాయం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు ను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అందరూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. కొంతమంది సెల్‌ఫోన్లు చూసి చెడు దోవ పడుతున్నారని హెచ్చరించారు. ఇప్పటి నుండే ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఒక లక్ష్యాన్ని పెట్టుకుని అందుకనుగుణంగా ముందు̄కెళ్లాలని మంత్రి సూచించారు. అదే విధంగా విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండటమే కాదు ఎవరైనా డ్రగ్స్ వాడినట్లు తెలిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు అధికారులు పాల్గొన్నారు.







# అంధత్వ నివారణకు అవిరళ కృషి

### నిర్విఘ్నంగా ఎమ్మెల్యే ఉగ్ర వైద్య శిబిరం

కనిగిరి, (చైతన్యరథం): కంటి చూపు కోల్పోయిన వారికి అండగా ఉండేందుకు గాను ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి నిరంతరం కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. జననీ చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి మరియు జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త సహకారంతో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో శనివారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. 100 మంది వృద్ధులు పాల్గొనగా శంకర కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రుతూజ పాటిల్ కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. గత నెల నవంబర్ 21న కంటి వైద్య శిబిరం జరుగగా కంటి ఆపరేషన్లు చేయించుకున్నవారికీ శంకర కంటి ఆసుపత్రి పారా మెడికల్ సిబ్బంది బీపీ షుగర్, కంటి పరీక్షలు చేశారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా కంటి అద్దాలు, చుక్కల మందులు పంపిణీ చేశారు. కాగా 40 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక కాగా వీరిని ఆదివారం అమరావతి గ్రౌండ్స్ నుంచి ఉగ్రనరసింహారెడ్డి ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంలో పెద కాకాని శంకర కంటి ఆసుపత్రికి తరలిస్తారు. కంటి ఆపరేషన్ల అనంతరం వీరంతా 31వ తేదీ తిరిగి కనిగిరికి వస్తారు. ఈ వైద్య శిబిరంలో శంకర కంటి ఆసుపత్రి స్టాఫ్ సైదులు, పారా మెడికల్ స్టాఫ్, తెలుగు మహిళలు పార్వతి, దొరసాని, తులసి, వెంకట లక్ష్మి, రెహ్మాన్, నాగమణి, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

# జగనే అసలు దొంగ

### తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్ విమర్శ

తిరుపతి, చైతన్యరథం: చార్జీలు పెంచిన జగన్ రెడ్డే ధర్నాలు చేయడం, చేయించడం ప్రజలను మోసం చేయడం కాదా.. అని తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు గొల్ల నరసింహ యాదవ్ ప్రశ్నించారు. శనివారం తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంటు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జగన్ అవినీతి వల్లే విద్యుత్ భారం రూ.1,29,000 కోట్లై జనం నెత్తిన పడిందన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపు పాపం ముమ్మాటికీ జగన్‌దేనని దుయ్యబట్టారు జగన్ అవినీతి, అసమర్థతతో జరిగిన నష్టం మొత్తం 1,29,503 కోట్లు అని వివరించారు. 5 ఏళ్లలో 10 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి



ప్రజలపై రూ.32 వేల కోట్లు భారం మోపారన్నారు. జగన్ రెడ్డి పాలనలో మైలవరం సోలార్ ప్లాంట్లపై దాడిచేసి ధ్వంసం చేశారన్నారు. చట్టవిరుద్ధంగా పీపీఏలను రద్దు చేయడం వల్ల 7 వేల మెగావాట్లు తక్కువ రేటుకు వచ్చే విద్యుత్ ఉత్పత్తి అర్థాంతరంగా ఆగిపోయిందన్నారు. అలా కాకుండా వారిని ప్రోత్సహించి ఉంటే వారి అనుభవంతో మరో 10 వేల మెగావాట్ల ప్లాంట్లను ఈపాటికే ఉత్పత్తిలోకి వచ్చి ఉండేవారన్నారు. జెన్ కో విద్యుత్ ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి తగ్గిపోవడానికి విజయసాయిరెడ్డి సరఫరా చేసిన నాసిరకం బొగ్గు కారణం అని తెలిపారు, నాణ్యమైన బొగ్గు తగినంత నిల్వ పెట్టుకోనందు వల్ల విద్యుత్ ఉత్పత్తి తగ్గిందన్నారు. విద్యుత్ సంస్థలపై 49 వేల కోట్లకు పైగా అప్పు చేసినా ఒక కొత్త విద్యుత్ ప్లాంటును కూడా వైసీపీ పరిపాలనలో నిర్మించలేదన్నారు.



# గంజాయి, డ్రగ్స్‌కు చరమగీతం

### అంతా సహకరించాలని ఎమ్మెల్యే కోటంరెడ్డి పిలుపు

నెల్లూరు రూరల్, (చైతన్యరథం): గంజాయి, డ్రగ్స్ రహిత నెల్లూరు రూరల్ నియోజకవర్గం లక్ష్యంగా పనిచేయడానికి సహకరించాలని పోలీసు అధికారులకు యంత్రాంగానికి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పోలీస్ యంత్రాంగానికి స్థానిక ఎమ్మెల్యేగా తనకు పజలు సహకరించాలని కోరారు. శనివారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో టౌన్, రూరల్ డీఎస్పీలు, సీఐలతో గంజాయి, డ్రగ్స్, రౌడీయిజం మీద సమావేశం నిర్వహించారు. ఎస్పీ గంజాయి, డ్రగ్స్, రౌడీయిజం మీద కఠినంగా వ్యవహరిస్తున్నారని ఆయనకు స్థానిక శాసనసభ్యుడిగా తన పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. ఇంకా కూడా కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమన్నారు. ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్, రౌడీయిజం మీద మన బిడ్డలు అనేక రకాలుగా సర్వనాశనం అవుతున్నారన్నారు. పోలీస్ యంత్రాంగానికి ప్రజలందరూ సహకరించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ ఎక్కడైనా వినియోగంలో ఉంటే పోలీస్ యంత్రాంగానికి కానీ నేరుగా తనకు గానీ తెలపాలన్నారు.

# కరెంటు చార్జీల భారం జగన్ పాపమే

### - డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, (చైతన్యరథం): విద్యుత్తు భారానికి కారణమైన వైసీపీ తప్పుడు ఆరోపణలపై దర్శి టీడీపీ ఇంచార్జి డాక్టర్ లక్ష్మీ విరుచుకుపడ్డారు. అధికారం కోల్పోయాక ప్రజలు గుర్తుకు వచ్చారా అని ప్రశ్నించారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో పది సార్లు కరెంటు చార్జీలు పెంచారన్నారు. లక్ష కోట్లు ప్రజలపై భారం మోపారన్నారు. కమీషన్లకు కక్కుర్తి పడి విద్యుత్ వ్యవస్థను నిర్వీర్యం



చేశారన్నారు. వారు చేసిన పాపాలే నేడు ప్రజలపై విద్యుత్ భారాలని అన్నారు. ఆ విషయం ప్రజలకు తెలుసన్నారు. ప్రజలను మరోసారి మోసం చేయాలని చూస్తే నమ్మే పరిస్థితుల్లో లేరని డాక్టర్ లక్ష్మీ వివరించారు. పరిస్థితుల్లో ప్రభుత్వం కొంత మేర విద్యుత్ ఛార్జీలు పెంచాల్సి వస్తే రాద్ధాంతం చేస్తున్నారని ఆమె ఆరోపించారు.విద్యుత్ ఛార్జీలు పెంచిన పాపానికి వైసీపీ పశ్చాత్తాపం పడకుండా ధర్నాలకు దిగడం ఎంతవరకు సమంజసం ఆలోచించుకోవాలన్నారు.

# వైసీపీ నేతల విద్యుత్ ఆందోళన హాస్యాస్పదం

### గూడూరు ఎమ్మెల్యే సునీల్ ఎద్దేవా



గూడూరు (చైతన్యరథం): జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో 2019 నుండి 2024 వరకు నడిచిన వైసిపి ప్రభుత్వం తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై లక్షల కోట్ల రూపాయలు భారం వేయడంతోపాటు విద్యుత్ సంస్థను నష్టాల్లోకి తీసుకువెళ్లిన ఘనత సాధించారని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ పేర్కొన్నారు. తామేదో విద్యుత్ చార్జీలు పెంచామని గగ్గోలు పెడుతూ వైసీపీ నాయకులు ధర్నాలు చేయడం హాస్య స్పదంగా ఉందని ఎద్దేవా చేశారు . తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ప్రజలపై భారం మోపుతూ విద్యుత్ చార్జీలు చారని అసత్య ప్రచారాలు చేస్తూ వైసిపి నాయకులు ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు . ప్రజలకు వాస్తవాలు తెలుసు కాబట్టి వైసిపీ నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమాలకు ప్రజల నుండి స్పందన రాలేదని గూడూరు వైసీపీ నాయకులు చేపట్టిన ధర్నా కార్యక్రమంలో పట్టణానికి చెందిన ఎవరు పాల్గొనక పోవడం ఉదాహరణగా పేర్కొన్నారు . ఆనాడు చంద్రబాబు నాయుడు నేతృత్వంలో 20వేల మెగా వాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో రైతులకు మరియు కొంతమంది బడుగు బలహీన వర్గాలకు ఉచిత విద్యుత్ వైసిపి ప్రభుత్వం ఇవ్వగలిగిందని గుర్తు చేశారు . జల జీవన్ మిషన్ కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గ పరిధిలో 20 కోట్ల రూపాయలు అవినీతి జరిగిందని ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆరోపించారు.

# అవినీతి జగన్ వల్లే విద్యుత్ భారం

### గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల



గిద్దలూరు, చైతన్యరథం: జగన్ రెడ్డి అవినీతి వల్లనే రాష్ట్ర ప్రజల పై అధిక విద్యుత్ భారాలు పడ్డాయని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి విమర్శించారు. 22.5 మిలియన్ యూనిట్ల లోటుతో 2014లో చంద్రబాబు పాలన ప్రారంభమయ్యి, 2019లో టీడీపీ ప్రభుత్వం, మిగులు విద్యుత్‌ను జగన్ రెడ్డి చేతిలో పెడితే వైసీపీ పాలన అంతమయ్యేనాటికి పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చిందన్నారు. మిగులు విద్యుత్ పాలన ప్రారంభించి ఇతర రాష్ట్రాలకన్నా ఎక్కువ వనరులున్న రాష్ట్రంలో నేడు ప్రధాన కారణం ముమ్మాటికి జగన్ రెడ్డి అవినీతి, కక్షసాధింపు విధానాలే కారణమని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మండిపడ్డారు. వైసీపీ 5 ఏళ్ల పాలనా కాలంలో 10 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల పై రూ.32 వేల కోట్లు భారం మోపిన జగన్ రెడ్డి ధర్నాలు చేయటం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగన్ రెడ్డి పాలనలో మైలవరం సోలార్ ప్లాంట్ల పై దాడిచేసి ధ్వంసం చేశారని చట్టవిరుద్ధంగా పీపీఏలను రద్దు చేయడం వల్ల 7 వేల మెగావాట్లు తక్కువ రేటుకు వచ్చే విద్యుత్ ఉత్పత్తి కోల్పోవడం జరిగిందన్నారు. విద్యుత్ సంస్థలపై 49 వేల కోట్లకు పైగా అప్పు చేసినా ఒక కొత్త విద్యుత్ ప్లాంటును నిర్మించలేదు. విద్యుత్ కొరతను కావాలని సృష్టించి కమిషన్ల కోసం బహిరంగ మార్కెట్లో అధిక రేట్లకు విద్యుత్తు కొనుగోలు చేయడం వల్ల రూ.2700 కోట్లు నష్టం వచ్చిందన్నారు. ట్రాన్స్ ఫార్మర్లు, స్మార్ట్ మీటర్లు లాంటి విద్యుత్ పరికరాలను కమిషన్లకోసం అధికరేట్లకు కొనుగోలు చేయడం వల్ల వేల కోట్ల నష్టం వచ్చింది. జగనే విద్యుత్ చార్జీలు పెంచి ఆయనే ధర్నాలు చేయడం ప్రజలను

# ప్లాస్టిక్ రహిత బనగానపల్లె లక్ష్యం

- మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి
- ప్రజలు అందిస్తున్న సహకారం అమోఘం
- విజయవంతంగా మెగా ర్యాలీ



బనగానపల్లె, (చైతన్యరథం): బనగానపల్లెలోని మంత్రి బీసీ జనార్ధనరెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, బీసీ ఇందిరా రెడ్డి ఆధ్వర్యంలో 'నా బనగానపల్లె - నా ఆరోగ్యం' సే నో ప్లాస్టిక్ నినాదాలతో ప్లాస్టిక్ మహమ్మారికి వ్యతిరేకంగా కదం తొక్కారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె ప్రజలు అందిస్తోన్న సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా ముందుకు సాగుతుందని అన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనలో బనగానపల్లె ప్రజలు, వ్యాపారులు, విద్యాసంస్థలు, అన్ని వర్గాల ప్రజల సహకారం మరువలేనిదని కొనియాడారు. విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొనడంతో పాటు, వారి తల్లిదండ్రుల్లో కూడా అవగాహన కల్పిస్తున్నారని ప్రశంసించారు. క్యాన్సర్‌కు కారణమైన ప్లాస్టిక్‌ను నిర్మూలించడం ద్వారా పర్యావరణంతో పాటు, మన ఆరోగ్యాలను కాపాడుకుందామన్నారు. మహిళలంతా కలిసికట్టుగా ఈ ప్లాస్టిక్ నిర్మూలన ఉద్యమాన్ని తమ ఇంటి నుంచే మొదలు పెట్టాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ మెగా ర్యాలీలో స్థానిక ప్రజలు, విద్యార్థిని విద్యార్థులతో పాటుగా, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా, ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా, ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రైతులకు పరిహారం అందిస్తాం..

# కాలువ పనులు పూర్తి చేస్తాం

- అవసరమైన నిధులు తెచ్చుకుంటాం
- ఎమ్మెల్యేలు, కాలువ, అమిలినేని హామీ
- కుడి కాలువకు నీటి విడుదల

అనంతపురం, (చైతన్యరథం) : అన్నదాతకు చేయూతనిచ్చి నిలబెట్టే విషయంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తోందని ఎమ్మెల్యేలు కాలువ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. హంద్రీనీవా, తుంగభద్ర ప్రాజెక్టుల నుంచి సాగు నీరు అందని ప్రాంతం ఏదైనా ఉంది అంటే అది కళ్యాణదుర్గం ప్రాంతం మాత్రమేనన్నారు. అలాంటి నియోజకవర్గానికి జీవనాడి అయిన బీటీపీకి నీళ్లు తీసుకువచ్చే కాలువ పనులు పూర్తి చేయడానికి ముందుగా భూములు ఇచ్చిన రైతులకు పరిహారం అందించాలన్నారు. కాలువ పనులు పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని తెలిపారు. శనివారం జరిగిన బీటీపీ ఆయకట్టు రైతుల సమావేశానికి అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, రాయదుర్గం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం శాసనసభ్యులు అమిలినేని సురేంద్ర బాబు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ముందుగా భైరవానితిప్ప ప్రాజెక్ట్‌లోకి 6.48 లక్షల చేప పిల్లలను వదిలి, కుడి కాలువ ఎడమ కాలువలకు అధికారులతో కలసి ఎంపీ, ఎమ్మెల్యేలు తూము గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ కళ్యాణదుర్గం ప్రాంతం ఎక్కువగా ఉద్యాన పంటలకు అనువుగా ఉంటుందన్నారు. అలాంటి ప్రాంతానికి సాగునీరు అందిస్తే మరింత ఎక్కువగా రైతులు పంటలు పండిస్తారన్నారు. త్వరలోనే కాలువకు భూములు ఇచ్చిన రైతులకు పరిహారం అందించి కాలువ పనులు పూర్తి చేసి బీటీపీతో పాటు 114 చెరువులకు నీళ్లు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. రైతులకు ఇబ్బంది లేకుండా బీటీపీ కింద ఉన్న ఆయకట్టు చివరి పొలం వరకు నీళ్లు ఇచ్చి తీరుతామని చెప్పారు. ఈ ఏడాది కుడి కాలువ కింద 1760 ఎకరాలకు నీళు అందిస్తున్నామన్నారు. నీటిని విడుదల చేయడం తమ అదృష్టంగా బావిస్తున్నామన్నారు. రెండున్నరేళ్లలో నీళ్లు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చామన్నారు. గడిచిన ఐదేళ్లలో జగన్ రెడ్డి ఈ ప్రాంతం వైపు కన్నెత్తి చూడలేదన్నారు. కరెంట్ చార్జీలు పెంచారని వైసీపీ శ్రేణులు ధర్నా చేయడం సిగ్గు చేటన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు, పెంచిన చార్జీలే తప్ప టీడీపీ ప్రభుత్వం ఎలాంటి విద్యుత్ చార్జీలు పెంచలేదన్నారు. ఆగిన ప్రాజెక్టలన్నీ తిరిగి ప్రారంభిస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. కాలువ శ్రీనివాసులు, ఎంపీ లక్ష్మీనారాయణతో పాటు ముఖ్యమంత్రిని కలసి బీటీపీ, 114 చెరువులకు నీళ్లు అందించేందుకు కృషి చేస్తామన్నారు.





# ఆలయ రికార్డులు తారుమారు

- స్పందించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి
- వారంలో సరిచేయాలని అధికారులకు ఆదేశం

బనగానపల్లె, (చైతన్యరథం): బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో అవుకు మండలం, లింగంబోడు గ్రామస్థులు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని శనివారం కలిశారు. తమ గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయ భూముల రికార్డులను స్థానిక నాయకులు తారుమారు చేసారని ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 50 లోని 7 ఎకరాల 34 సెంట్ల భూమిని సబ్ డివిజన్ చేసి ముగ్గురు పేర్ల మీద ఆన్ లైన్‌లో నమోదు చేయించుకున్నారని వివరించారు. దేవుడు మాన్యం భూములు దేవుడికే చెందాలని, తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు మూకుమ్మడిగా వచ్చి చెప్పడంతో మంత్రి సానుకూలంగా స్పందించారు. అక్కడిక్కడే సంబంధిత రెవెన్యూ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వారంలోపు సమస్యను పరిష్కరించి, ఆలయ భూములను దేవుడికి చెందేలా నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

బనగానపల్లె, అవుకుమెట్ట దగ్గర ప్రజల తాగునీటి సౌకర్యార్థం సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌న్ను మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, బీసీ అభిమానులు పాల్గొన్నారు.

# బాలికల పాఠశాల తనిఖీ

### వసతులపై ఆరా తీసిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర, (చైతన్యరథం) : పట్టణం ప్రభుత్వ బాలికల పాఠశాలలో భోజనం వసతులను మడకశిర ఎమ్మెల్యే టీటీడీ బోర్డు సభ్యుడు ఎంఎస్‌రాజు పరిశీ లించారు. శనివారం ఆయన పాఠశాలను సందర్శించారు. పరి శీలించిన ప్రభుత్వ బాలికల పాఠశాల నందు మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనాలను పరిశీ లించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య దర్శి శ్రీనివాస్ మూర్తి, ఎంఈవో భాస్కర్, ఉపాధ్యాయులు, కన్వీనర్ లక్ష్మీ నారాయణ, క్లస్టర్ ఇంచార్జ్ నాగరాజు పాల్గొన్నారు. హాస్టల్ కమిటీ సభ్యులు కృష్ణమూర్తి , సుబ్బారెడ్డి, రవికుమార్, కౌన్సి లర్లు, బలరాం ఇతర నాయకులు పాల్గొన్నారు.



### చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని అడ్డుకుంటే..

# జనం రాళ్ల వర్షం కురిపిస్తారు జాగ్రత్త జగన్ !

### రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి హెచ్చరిక

కర్నూలు, (చైతన్యరథం) : గడిచిన 5 సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన జగన్మోహన్‌రెడ్డి ఆయన అనుయాయులు దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజలకు చేసింది శూన్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలిగించి, అడ్డుకోవాలని వైసీపీ శ్రేణులను ఉసిగొల్పుతున్న జగన్‌రెడ్డిపై ప్రజలు రాళ్ల వర్షం కురిపిస్తారు జాగ్రత్తగా ఉండాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసినన్ని రోజులు ప్రజల సొమ్ము దోచుకోవడమే పనిగా పాలన సాగిందన్నారు. ఇది చాలదన్నట్లుగా తిరిగి మనమే అధికారంలోకి వస్తామనీ అధికారులకు, వైసీపీ పటాలానికి జగన్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నార. కేవలం పార్టీ నాయకులను బయట పార్టీలలోకి వెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నం మాత్ర మేనన్నారు. దాన్ని కప్పి పుచ్చు కునేందుకు చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో



విఫలమయ్యారంటూ, నమ్మించేందుకు తప్పుడు మాటలు వల్లిస్తు న్నారన్నారు. వారి మాటలను వైసీపీ వాళ్ళు నమ్ముతారేమో కానీ రాష్ట్ర ప్రజలు మాత్రం నమ్మేస్థితిలో లేరన్న విషయాన్ని జగన్ గుర్తుంచుకుంటే మంచిదని అన్నారు. అధికారంలో ఉన్నన్ని రోజులు మద్యం, ఇసుక, గంజాయి వంటి ఘన కార్యాలే కాక పేద ప్రజల నోటికాటి కూడును కూడా జగన్ మాఫియా కాజే సిందన్నారు. పేదవాడి ఆకలి తీర్చేం దుకు ప్రభుత్వం అందిస్తున్న బియ్యాన్ని మింగేసిన స్కాములో వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల పేర్లు బయటకు వస్తున్నా యన్నారు. ప్రసార మాధ్యమాల్లో కథలు, కథలుగా కథనాలు వెలువడుతుంటే జగన్ ఎందుకు సమాదానం చెప్పడం లేదని నిలదీశారు. జగన్ అధికారంలో ఉండి పది సార్లు విద్యుత్ చార్జీలు పెంచిన విష యాన్ని విస్మరించి, నేడు చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచారనీ జగన్ రోడ్ల పైకెక్కి పార్టీ వారితో నాట కాలాడిస్తున్నారన్నారు. విద్యుత్ పాలసీలో జగన్ హయాంలో చేసిన పాపాలను కూడా బయటపెట్టాలనీ సవాల్ చేస్తున్నానన్నారు.

# ముగిసిన మన్మోహన్ అంత్యక్రియలు

**- హాజరైన రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర మంత్రులు**

**- పాడె మోసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్**

ఢిల్లీ: అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు ముగిశాయి. ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్ లో ఆయన పార్థివదేహానికి ప్రభుత్వ లాంఛనాలతో శనివారం అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పాడె మోశారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, కిరణ్ రిజిజు, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, ప్రియాంక గాంధీ, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా హాజరై మాజీ ప్రధానికి తుది వీడ్కోలు పలికారు. త్రివిధ దళాల అధిపతులు మన్మోహన్‌ నివాళులర్పించారు. అంత్యక్రియలకు ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, బీఆర్ఎస్ కార్యనిర్వాహక



అధ్యక్షుడు కేటీఆర్ హాజరయ్యారు. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యల్ వాంగ్చుక్, విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మన్మోహన్ పార్థివదేహాన్ని పార్టీ నేతలు, కార్యకర్తల సందర్శనార్థం శనివారం ఉదయం ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తీసుకువచ్చారు. కాంగ్రెస్ నేతలు రాహుల్, సోనియా, ప్రియాంక గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి, తదితరులు నివాళు లర్పించారు. తర్వాత అక్కడినుంచి నిగమ్ బోధ్ ఘాట్ వరకు అంతిమయాత్ర కొనసాగింది. ఈ సమయంలో రాహుల్.. మన్మోహన్ కుటుంబం వెన్నంటే ఉన్నారు.

92 ఏళ్ల మన్మోహన్ సింగ్ వయసురీత్యా తలెత్తిన అనారోగ్య సమస్యల తో గురువారం రాత్రి ఇంటివద్ద అకస్మాత్తుగా స్పృహ కోల్పోయారు. దీంతో కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మన్మోహన్ పదేళ్ల పాటు దేశానికి ప్రధానిగా పని చేశారు. అంతకుముందు ఆర్బీఐ గవర్నర్‌గా వ్యవహరించారు. ప్రధానిగా పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగానూ బాధ్యతలు నిర్వర్తించారు.

**బైడెన్ సంతాపం**

అంతకుముందు మన్మోహన్ సింగ్ మృతికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంతాపం తెలిపారు. మాజీ ప్రధాని సతీమణి గురుశరణ్ సింగ్, కుటుంబసభ్యులకు బైడెన్ దంపతులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు వైట్ హౌస్ ఓ ప్రకటన విడుదల చేసింది.

# కాశ్మీర్‌లో భారీగా హిమపాతం

**రవాణా సర్వీసులకు అంతరాయం**



మంచు వర్షంలో చిక్కుకుని ఉత్తర భారతం గజగజ వణుకుతోంది. జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లో భారీగా మంచు కురుస్తోంది. శుక్రవారం నుంచి విపరీతంగా మంచు కురుస్తుండటంతో జమ్మూకాశ్మీర్లోని పలు ప్రాంతాలు శ్వేతవర్ణంలోకి మారిపోయాయి. దీంతో పలు రవాణా సర్వీసులకు అంతరాయం కలిగినట్లు అధికారులు పేర్కొన్నారు. శ్రీనగర్- జమ్మూ జాతీయ రహదారి, మొఘల్ రోడ్డును మూసివేసినట్లు తెలిపారు. ప్రతికూల వాతావరణం కారణంగా శ్రీనగర్ విమానాశ్రయం నుంచి సర్వీసులు నిలిపివేశామన్నారు. రైల్వే ట్రాక్‌లపై భారీగా మంచు పేరుకుపోవడంతో బనిహాల్-బారాముల్లాల మధ్య పలు రైళ్లను రద్దు చేశామని పేర్కొన్నారు. విపరీతంగా కురుస్తున్న హిమపాతం వల్ల శ్రీనగర్- జమ్మూ జాతీయరహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిందని, దాదాపు 2,000 వాహనాలు నిలిచిపోయాయని అధికారులు తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. బనిహాల్ నుంచి శ్రీనగర్ వరకు మంచు తెరిపివ్వకుండా కురుస్తూనే ఉంది. పరిస్థితులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఖాజిగుండ్ వద్ద దాదాపు 2,000 వాహనాలు మంచులో కూరుకుపోయాయి. ముందుగా భారీ వాహనాలను తరలించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

వాతావరణ పరిస్థితుల్లో విపరీతమైన మార్పు కారణంగా శ్రీనగర్ కు వెళ్లే విమానాలను రద్దు చేసినట్లు ఇండిగో ఎయిర్‌లైన్స్ తెలిపింది. మరోవైపు కాశ్మీర్ విశ్వవిద్యాలయం పరిధిలో శనివారం జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేసినట్లు విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు.

శ్రీనగర్‌తో పాటు, గందర్‌బల్, అనంత్‌నాగ్, కుల్‌గాంచ షోపియాన్, పుల్వామా జిల్లాల కూడా ఈ సీజన్‌లో మొదటి హిమపాతం నమోదైంది. గుల్‌మార్గ్‌లోని పసిద్ధ స్కీ రిసార్ట్, సోనామార్గ్, పహల్గామ్, గురేజ్, మొఘల్ రోడ్, బండిపోరా, బారాముల్లా, కుప్వారా జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో కూడా మంచు కురుస్తున్నట్లు అధికారులు తెలిపారు. కాగా హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలిలో దట్టమైన మంచులో చిక్కుకున్న ఓ వాహనం అదుపుతప్పి లోయలోకి జారిపడిన దృశ్యాలు వైరల్‌గా మారాయి. స్థానిక ప్రజలు, పర్యాటకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

# పీఎం కేర్స్‌కి భారీగా తగ్గిన విరాళాలు

PM CARES
Prime Minister's Citizen Assistance and Relief in Emergency Situations Fund

ఢిల్లీ: దేశంలో కరోనా వైరస్ విలయ తాండవం చేస్తున్న సమయంలో.. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పీఎం కేర్స్ పేరుతో అత్యవసర సహాయ నిధిని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే.. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఈ నిధికి విరాళాలు రూ.912 కోట్లకు పడిపోయాయి. ఈ ఫండ్ ఏర్పాటు చేసిన అనంతరం ఒక ఏడాది వ్యవధిలో ఇంత తక్కువ నిధులు రావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

పీఎం కేర్స్ వెబ్‌సైట్‌పై జరిగిన ఆడిట్ స్టేట్‌మెంట్ గణాంకాల ప్రకారం.. 2020-21లో అత్యధికంగా రూ.7,184 కోట్ల విరాళాలు రాగా.. 2021-22లో రూ.1938 కోట్ల విరాళాలు వచ్చాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.912 కోట్లకు పడిపోయింది. కొవిడ్ తర్వాత ఈ నిధికి వచ్చే విదేశీ విరాళాలు బాగా తగ్గిపోయాయి. 2020-21లో గరిష్ఠంగా రూ.495 కోట్లు రాగా.. తర్వాత రెండేళ్లలో రూ.40 కోట్లు, రూ.2.57 కోట్లకు పడిపోయాయి.

2022-23లో పీఎం కేర్స్ నిధి నుంచి దాదాపు రూ.439 కోట్లు వ్యయం చేశారు. దీనిలో రూ.346 కోట్లను.. కొవిడ్ కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల కోసం కేంద్రం వినియోగించింది. రూ.92 కోట్లను ఆక్సిజన్ కాన్సంట్రేటర్ల కోసం ఖర్చు చేసింది. 2021-22లో రూ.1703 కోట్లను ఆక్సిజన్ కోసం ఖర్చు చేయగా.. రూ.835 కోట్లను వెంటిలేటర్ల కోసం వెచ్చించింది. 2022-23 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ఫండ్ బ్యాలెన్స్ రూ. 6,283 కోట్ల కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం.

కాగా.. దేశంలో కరోనా వైరస్ విజృంభిస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం పీఎం సహాయ నిధి పేరుతో అత్యవసర సహాయ నిధిని ఏర్పాటు చేసింది. దీంతో పీఎం నిధికి పెద్ద ఎత్తున విరాళాలు వచ్చాయి. కొవిడ్ తర్వాత నిధులు భారీగా తగ్గాయి.

# చెన్నై అత్యాచార బాధితురాలికి రూ. 25 లక్షల పరిహారం

***ఘటనపై విచారణకు సిట్ - మద్రాస్ హైకోర్టు ఆదేశం***

చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నైలోని అన్నా యూనివర్సిటీ ప్రాంగణంలో ఓ విద్యార్థిపై అత్యాచార ఘటన రాష్ట్రంలో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ క్రమంలోనే దీనిపై విచారణ జరిపిన మద్రాస్ హైకోర్టు .. ఘటనపై విచారణ జరిపేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఈ సిట్‌లోని ముగ్గురు సభ్యులు మహిళా ఐపీఎస్ అధికారులే ఉండాలని స్పష్టం చేసింది. అంతేగాక, బాధితురాలికి రూ.25 లక్షల పరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ కేసును సీబీఐకి అప్పగించాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిణామాల కారణంగా విద్యార్థిని చదువుపై ఎలాంటి ప్రభావం పడకూడదని తెలిపింది. ఆమె నుంచి ఫీజు వసూలు చేయొద్దని యూనివర్సిటీని న్యాయస్థానం ఆదేశించింది.

చెన్నైలోని అన్నా విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ చదువుతున్న ఓ విద్యార్థిని ఈ నెల 23న రాత్రి తన స్నేహితుడితో కలిసి వర్సిటీ ప్రాంగణంలో మాట్లాడుతుండగా అక్కడికి ఇద్దరు వ్యక్తులు వచ్చారు. ఆమె స్నేహితుడిపై దాడి చేసి అక్కడి నుంచి తరిమేశారు. అనంతరం ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె ఫొటోలు తీసి, తమపై ఫిర్యాదు చేస్తే వాటిని సామాజిక మాధ్యమాల్లో పెడతామని బెదిరించారు.

దీనిపై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా ఓ యువకుడిని అరెస్టు చేశారు. మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన రాష్ట్రంలో రాజకీయ దుమారానికి దారితీసింది. ఈ ఘటనలో నిందితుడికి డీఎంకేతో సంబంధాలున్నాయని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు.

## కొత్త సంవత్సరం వేళ..

# ఛలో అయోధ్య!

**- పర్యాటకులతో కళకళలాడనున్న రామ జన్మభూమి**

**- ఇప్పటికే హొటళ్లన్నీ ఫుల్**



అయోధ్య: శ్రీరాముడి జన్మస్థలం అయోధ్య నగరం కొత్త సంవత్సరం వేళ పర్యాటకులతో కళకళలాడనుంది. నూతన ఏడాది సంబరాలు, అలాగే బాలరాముడు కొలువుదీరి సంవత్సరం పూర్తి కావొస్తుండటంతో భక్తులు పెద్ద సంఖ్యలో అయోధ్యకు తరలిరానున్నారు. దాంతో ఎలాంటి నిర్వహణ లోపాలు తలెత్తకుండా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే దర్శన వేళలు పెంచుతూ రామ జన్మభూమి తీర్థక్షేత్రట్రస్ట్ నిర్ణయం తీసుకుంది.

భక్తులకు స్వాగతం పలికేందుకు అంతా సిద్ధంగా ఉంది. జనవరి 15 వరకు హొటల్ గదులన్నీ ముందుగానే బుక్ అయ్యాయని స్థానిక హొటల్ యజమాని అంకిత్ మిశ్రా వెల్లడించారు. చాలా తక్కువ సంఖ్యలో మాత్రమే గదుల లభ్యత ఉందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇదే అదనుగా కొందరు హొటళ్ల యజమానులు ఒక్కరోజుకు రూ.10వేల వరకు వసూలు చేస్తున్నట్లు వెల్లడించాయి. రాముడి ఆలయం, హనుమాన్‌గఢీ, లతాచౌక్, గుప్తర్ ఘాట్, సూరజ్‌కుండ్, ఇతర ప్రఖ్యాత స్థలాల వద్ద భారీగా భద్రతా ఏర్పాట్లు చేశామని అయోధ్య పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

ఈ ఏడాది జనవరి 22న అయోధ్య రామమందిరంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగిన సంగతి తెలిసిందే. ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా బాలరాముడికి గర్భగుడిలో ప్రాణప్రతిష్ఠ శాస్త్రోక్తంగా జరిగింది. ఆ వేడుకకు దేశ, విదేశాల్లోని అత్యంత ప్రముఖులు, స్వామీజీలు కలిపి దాదాపు 7 వేల మంది విచ్చేశారు. రాజకీయ, సినీ, క్రీడా రంగానికి చెందిన ప్రముఖులు ప్రాణప్రతిష్ఠ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించి పులకించిపోయారు.

అయోధ్య, వారణాసి ఆలయాలను సందర్శన నిమిత్తం ఉత్తరప్రదేశ్‌కు పర్యాటకులు భారీగా తరలివస్తుంటారు. రామ మందిర ప్రారంభం తర్వాత మొదటి ఆరు నెలల్లో యూపీకి పర్యాటకుల రాక గణనీయంగా పెరిగింది. గత జనవరిలోనే రికార్డు స్థాయిలో ఏడు కోట్ల మంది సందర్శించారని ఇటీవల యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

# పాక్‌పై తాలిబన్ల ప్రతీకార దాడులు



పాకిస్థాన్‌పై అఫ్ఘనిస్థాన్ ప్రతీకార దాడులకు దిగింది. దీనిలో భాగంగా పాక్‌లోని కొన్ని స్థావరాలను లక్ష్యంగా చేసుకొని దాడులు జరిపింది. ఈ విషయాన్ని అఫ్ఘాన్ రక్షణ మంత్రిత్వశాఖ వెల్లడించింది. "పాకిస్థాన్‌పై అఫ్ఘాన్ ప్రతీకార దాడులకు దిగింది. ఆ దేశంలోని కొన్ని ముఖ్యమైన ప్రాంతాలు, రహస్య స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేశాం" అని రక్షణ శాఖ ప్రతినిధి ఇనాయాతుల్లా క్వార్జామి 'ఎక్స్' (ట్విటర్) వేదికగా వెల్లడించారు. పాక్‌పై ఈ దాడులు ఎలా చేశారు, దీనిలో ఎంతమంది మరణించారనే అంశాలను ప్రతినిధి ప్రస్తావించలేదు. అయితే.. తాలిబన్లకు మద్దతుగల ఓ మీడియా సంస్థ మాత్రం.. ఈ దాడుల్లో 19మంది పాకిస్థాన్ సైనికులు మరణించారని కథనంలో పేర్కొంది. తాలిబన్ల దాడులపై ఇప్పటివరకు పాక్‌నుంచి ఎలాంటి స్పందన రాలేదు. కాగా.. అఫ్గన్‌ను తాలిబన్లు ఆక్రమించుకున్న తర్వాత సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల తమ దేశంలో జరిగిన పలు ఉగ్రదాడులకు తాలిబన్లే కారణమని పాకిస్థాన్ ఆరోపిస్తోంది. ఈ ఆరోపణలను తాలిబన్ వర్గాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఈ ఏడాది మార్చిలో అఫ్ఘాన్‌పై దాడులు చేసిన పాక్.. ఇటీవల మరోసారి వైమానిక దాడులకు పాల్పడింది..

ఈ దాడుల్లో ఇప్పటివరకు 46మంది ప్రాణాలు కోల్పోగా పలువురి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో చిన్నారులు, మహిళలు కూడా ఉన్నట్లు తాలిబన్ ప్రభుత్వం వెల్లడించింది. ఈ దాడులపై పాక్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన రాలేదు. తమ దేశంపై దాడులకు పాల్పడిన వారిపై ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించిన అఫ్ఘానిస్థాన్ తాజాగా దాడులకు దిగింది.

### హెచ్1బీ వీసా అంశం..

## ఆ మూర్ఖులను తొలగించాలి: మస్క్



హెచ్1 బీ వీసాల విస్తరణపై డొనాల్డ్ ట్రంప్ పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ చట్టబద్ధమైన వలసలకు మద్దతిస్తుంటే.. ఇతరులు మాత్రం అమెరికా ఫస్టుకు కట్టుబడి ఉన్నారు. దాంతో పార్టీ నేతల మధ్యే పలు వాదనలు వినిపిస్తున్నాయి. ఈక్రమంలో మస్క్ ఘాటుగా పోస్టు చేశారు. రిపబ్లికన్ పార్టీలోని ధిక్కరించే మూర్ఖులను తొలగించాలని పోస్టు పెట్టారు. అమెరికా కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ జనవరిలో ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈలోపు పలు పదవులకు కొత్తవారిని నియమిస్తున్నారు. ఇప్పటివరకు ఐదుగురు భారత అమెరికన్లను కీలక పదవులకు ఎంచుకున్నారు. అయితే వారిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై వైట్‌హౌస్ సీనియర్ పాలసీ అడ్వైజర్‌గా వెంచర్ క్యాపిటలిస్ట్ శ్రీరామ్ కృష్ణన్ ఎంచుకోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. నైపుణ్యం కలిగిన వలసదారుల కోసం గ్రీన్‌కార్డుల విషయంలో ఉన్న పరిమితులను తొలగించాలని గతంలో శ్రీరామ్ పిలుపునిచ్చారు. దీనిపై ట్రంప్ మద్దతుదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇది సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది.

ఎలాన్ మస్క్ హెచ్1బీ వీసాపైనే అమెరికాకు వలస వచ్చారు. టాలెంట్ ఎక్కడున్నా దానిని అందిపుచ్చుకోవాలని ఆయన ఎప్పుడూ చెప్తుంటారు. "మీ బృందం విజయం సాధించాలంటే అద్భుతమైన ప్రతిభ ఉన్న వ్యక్తులు ఎక్కడున్నా మన జట్టులో చేర్చుకోవాలి" అని ఓ సందర్భంలో అన్నారు. మస్క్ బాటలోనే వివేక్ రామస్వామి వాదన కూడా ఉంది. ఆయన కూడా భారత్‌నుంచి వలసవచ్చిన కుటుంబంలో జన్మించారు. అమెరికా సంస్కృతిలో ఉన్న లోటుపాట్లను ఎత్తి చూపారు. ఆ లోపాలవల్లే పెద్ద సంస్థలన్నీ విదేశాల్లో జన్మించిన వారిని నియమించు కుంటున్నాయనే అర్థంలో విమర్శలు చేశారు.

మరోవైపు రిపబ్లికన్ పార్టీకి చెందిన నిక్కీ హేలీ భిన్నమైన వాదనను వినిపించారు. "నేను సౌత్ కరోలినా గవర్నర్‌గా పనిచేసిన సమయంలో నిరుద్యోగిత రేటు 11శాతం నుంచి 4 శాతానికి పడిపోయింది. విదేశీ ఉద్యోగులను కాకుండా పెట్టుబడులను మాత్రమే ఆహ్వానించాం కాబట్టే అది సాధ్యమైంది. కొత్త ఉద్యోగాల కోసం ప్రజలకు శిక్షణ ఇవ్వడం వల్ల వారు ఇప్పుడు విమానాలు, ఆటోమొబైల్స్ తయారీలో రాణిస్తున్నారు. సాంకేతికరంగాన్ని బలోపేతం చేయాలని భావిస్తే ముందు విద్యారంగంపై దృష్టిసారించాలి. అంతేకానీ అమెరికన్లను తక్కువ అంచనా వేయొద్దు" అని స్పష్టంగా తన అభిప్రాయాన్ని వినిపించారు. ఈనేపథ్యంలో మస్క్ పోస్టు పెట్టారు.

## ఉ.కొరియా సైనికులకు రక్షణ ఏదీ?

### రష్యాపై జెలెన్ స్కీ వాగ్బాణాలు



ఉక్రెయిన్‌తో జరుగుతోన్న యుద్ధంలో రష్యాకు మద్దతుగా ఉత్తరకొరియా సైన్యం పోరాడుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మాస్కోపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ తీవ్ర ఆరోపణలు చేశారు. కిమ్ సైనికులకు రష్యా కనీస రక్షణ సౌకర్యాలు కల్పించకుండా యుద్ధ రంగంలోకి దించిందని పేర్కొన్నారు. "మాపై యుద్ధంలో పాల్గొన్న ఉత్తరకొరియా సైనికులకు సంబంధించిన నివేదికలు అందాయి. పోరులో గాయపడిన సైనికులను మా దళాలు బంధించాయి. తర్వాత వారు చనిపోయారు. తీవ్రంగా గాయపడి ఉండటంతో మేము వారిని కాపాడలేకపోయాం' అని జెలెన్‌స్కీ తెలిపారు. కీవ్‌పై యుద్ధంలో పాల్గొన్న కిమ్ సైనికులను ఉక్రెయిన్ బలగాలు బంధించాయని దక్షిణ కొరియా స్పై ఏజెన్సీ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది. తాజాగా జెలెన్ స్కీ ఇదే విషయాన్ని ధ్రువీకరించారు.

మరోవైపు.. దక్షిణ కొరియా స్పై ఏజెన్సీ ప్రకటనపై వైట్‌హౌస్ స్పందించింది. 'ఉత్తర కొరియా సైనికులు ఉక్రెయిన్ దళాలకు లొంగిపోకుండా తమ ప్రాణాలను తీసుకుంటున్నట్టు మాకు నివేదికలు అందాయి. వారి కుటుంబాలపై ప్రతీకారం తీర్చుకుంటారనే భయంతో కావొచ్చు' అని అమెరికా జాతీయ భద్రతా అధికార ప్రతినిధి జాన్ కిర్బీ వెల్లడించారు.

2022 ప్రారంభం నుంచి రష్యా- ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం నడుస్తోంది. ముగింపుఛాయలు ఎక్కడా కనిపించడం లేదు. ఉక్రెయిన్ చొరబాటును అరికట్టేందుకు ప్రయత్నిస్తోన్న రష్యా.. సరిహద్దు ప్రాంతమైన కుర్స్క్ భారీస్థాయిలో సైన్యాన్ని మోహరించింది. ఇందులోభాగంగా మూడు గ్రామాల్లో దాదాపు 10వేల మంది కిమ్ సైనికులు పోరాడుతున్నారు. తొలుత వీరికి ప్రత్యేక శిక్షణ ఇప్పించిన అనంతరం కదనరంగంలోకి దింపారు. అయినప్పటికీ భాష సమస్య కారణంగా మాస్కో, కొరియన్ సేనల మధ్య సమన్వయం లోపించి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కథనాలు వచ్చాయి. తొలి వారాల్లోనే ప్రతీ పదిమంది కిమ్ సైనికుల్లో ఒకరు ప్రాణాలు కోల్పోయారని ద.కొరియా తెలిపింది. యుద్ధంలో పోరాడే శక్తి కిమ్ దళాలకు లేకపోవడంతో ప్రాణనష్టం ఎక్కువగా ఉంటోందని అమెరికా సైతం అభిప్రాయం వ్యక్తంచేసింది. వేలమంది కొరియన్ సైనికులు చనిపోయి ఉండడమో లేదా గాయపడటమో జరిగిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ వెల్లడించారు. మరోవైపు చనిపోయిన సైనికుల ముఖాలను గుర్తుపట్టకుండా పుతిన్ సేనలు కాల్చేస్తున్నాయని ఆయన ఆరోపించారు.

## కమాన్.. దోచుకోండి!



ఏదైనా కొత్త షాప్ ఓపెన్ అయితేనో.. డిస్కౌంట్ అంటేనో జనాలు పెద్దఎత్తున ఎగబడతారు. అందులోనూ పండగల సమయాల్లో ఇలాంటి ఆఫర్లు పెడితే ఊరుకుంటారా? అదే, ఒకవేళ నచ్చిన వస్తువును ఫ్రీగా పట్టుకెళ్లండని ఎవరైనా ఆఫర్ ఇస్తే? ఇంకేమైనా ఉంటుందా? ఆస్ట్రేలియాలోని పెర్త్‌లో అదే జరిగింది. బాక్సింగ్ డే సందర్భంగా ఓ స్టోర్ ఓనర్ ఇచ్చిన ఆఫర్ తొక్కిసలాటకు దారితీసింది. పెర్త్‌కు చెందిన స్ట్రీట్ ఎక్స్ అనే దుస్తుల దుకాణం యజమాని డేనియల్ బ్రాడ్‌షా వినూత్న మార్కెట్ ప్రచారానికి పెట్టింది పేరు. తాను వందలాది టీ షర్టులు గివ్ అవే ఇవ్వబోతున్నానంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. దీంతో బాక్సింగ్ డే రోజున పెర్త్‌లోని స్ట్రీట్ ఎక్స్ స్టోర్‌కు వందలాది యువకులు చేరుకున్నారు. షట్టర్ తెరవగానే లోనికి చొచ్చుకెళ్లారు. తొక్కిసలాట సందర్భంగా పలువురు స్వల్పంగా గాయపడ్డారు. ఓ వ్యక్తి ముందు జాగ్రత్త చర్యగా సైకిల్ హెల్మెట్, ప్యాడ్స్ ధరించి షాప్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. ఈ గివ్ అవేపై డేనియల్ బ్రాడ్‌షా మాట్లాడుతూ.. కస్టమర్ల కోసం ఏదైనా సరదాగా చేయాలన్న ఉద్దేశంతోనే పూర్తి స్టోర్‌ను ఫ్రీగా ఉంచినట్లు తెలిపాడు. సుమారు 400 వస్తువులు కేవలం 30 సెకన్లలో పూర్తయ్యాయని తెలిపాడు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని పేర్కొన్నాడు. అయితే, కొందరు వ్యక్తులు షాప్‌నుంచి బయటకొచ్చాక కూడా ఒకరి చేతుల్లోంచి ఒకరు దుస్తులు లాక్కోవడం కనిపించింది. దీనికి సంబంధించి వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.

### ట్రంప్ అధికారం చేపట్టేవరకూ

## టిక్‌టాక్‌పై నిషేధం వద్దు



చైనాకు చెందిన సోషల్ మీడియా యాప్ టిక్‌టాక్‌ను అమెరికాలో నిషేధం విధించే అవకాశాలపై కీలక పరిణామం చోటుచేసుకున్నాయి. అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ అధికార బాధ్యతలు చేపట్టేవరకు దానిపై నిషేధం విధించవద్దని ఆయన తరపు లాయర్లు సుప్రీంకోర్టును కోరారు. వచ్చే ఏడాది జనవరి 20న ట్రంప్ అధికార బాధ్యతలు చేపట్టనున్నారు. ఈక్రమంలో టిక్‌టాక్ నిషేధం కేసుకు సంబంధించి మరింత సమయం ఇవ్వాలని ట్రంప్ న్యాయవాదులు సుప్రీం కోర్టును అభ్యర్థించారు. దీనిపై రాజకీయ తీర్మానం చేపట్టే అవకాశం ఉందని వారు కోర్టుకు తెలియజేశారు. యూజర్ల సమాచారం సేకరిస్తున్నారనే ఆరోపణలతో భారత్ సహా పలు దేశాలు టిక్‌టాక్‌పై నిషేధం విధించాయి. గతంలో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో అమెరికా కూడా దీనిపై చర్యలకు సిద్ధమైంది. కానీ, న్యాయపరమైన సమస్యల కారణంగా అది కార్యరూపం దాల్చలేదు. అప్పట్లో ట్రంప్ ఆ యాప్ నిషేధానికి తీవ్రంగా ప్రయత్నించారు. జాతీయ భద్రతకు టిక్‌టాక్ పెద్ద ముప్పుగా ఉందంటూ ఆరోపణలు చేశారు. ఆ తర్వాత అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన జో బైడెన్ దాని నిషేధంపై బిల్లు ప్రవేశపెట్టారు. దీనికి మద్దతుగా 352మంది ఓటు వేయగా.. 65మంది వ్యతిరేకించారు. దీంతో ఆ బిల్లు ఆమోదం పొందింది. ఈనేపథ్యంలో ఈ బిల్లుకు ట్రంప్ పరోక్షంగా మద్దతు పలికారు. అయితే, కొన్ని రోజుల తర్వాత ఆయన టిక్‌టాక్‌లో చేరారు. దీంతో నిషేధంపై తన నిర్ణయాన్ని మార్చుకుంటున్నట్లు స్వయంగా తెలిపారు. ఇటీవల అధ్యక్ష ఎన్నికల ప్రచారంలోనూ ఆ యాప్ నిషేధంపై కీలక వ్యాఖ్యలు చేశారు. తాను అధికారంలోకి వస్తే టిక్‌టాక్‌ను నిషేధించబోనంటూ స్పష్టంచేశారు.

## విమాన ప్రమాదం.. పుతిన్ సారీ



అజర్ బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన 22-8243 విమానం కూలిపోవడంతో 38మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తాజాగా స్పందించారు. ఈ ప్రమాదం జరగడంపై విచారం వ్యక్తం చేసిన ఆయన.. అజర్ బైజాన్ దేశాధినేతను క్షమాపణలు కోరారు. విమానం అజర్ బైజాన్‌లోని బాకు నగరం నుంచి రష్యాలోని చెచెన్ ప్రాంతానికి చెందిన గ్రోజ్నికి ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకొంది. కజఖిస్థాన్‌లో ల్యాండింగ్ సమయంలో విమానం కుప్పకూలిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 38 మంది మృతి చెందగా, 29 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన రోజున ఉక్రెయిన్ డ్రోన్ దాడులను ఎదుర్కొనేందుకు గ్రోజ్ని సమీపంలో రష్యా గగనతల రక్షణ వ్యవస్థ క్షిపణులను ప్రయోగిస్తోందని క్రెమ్లిన్ పేర్కొంది.

ఆ క్షిపణుల్లో ఒకటి విమానాన్ని తాకినట్లు స్పష్టం చేసింది. అంతకుముందు.. రష్యా క్షిపణి తాకడం కారణంగా విమానం కూలిందంటూ ఉక్రెయిన్‌తో పాటు అజర్ బైజాన్ కూడా ఆరోపించింది. ఈ క్రమంలోనే స్పందించిన అధ్యక్షుడు పుతిన్. అజర్ బైజాన్ దేశాధినేత ఇల్హామ్ అలీయేవ్‌ను క్షమాపణలు కోరారు. ఉక్రెయిన్, అజర్ బైజాన్ ఆరోపణల వేళ.. రష్యా ప్రకటనతో పాటు పుతిన్ స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# కంగారూల గడ్డపై తెలుగోడి సత్తా




## సెంచరీతో చెలరేగిన నితీష్ రెడ్డి

టీమిండియా యువ ఆల్‌రౌండర్, తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి చరిత్ర సృష్టించాడు. 8వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి టెస్ట్ సెంచరీ సాధించిన తొలి భారత బ్యాటర్‌గా నిలిచాడు. ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగో టెస్ట్‌లో ఈ తెలుగోడు అరంగేట్ర సెంచరీతో ఈ అరుదైన ఫీట్ అందుకున్నాడు. మూడో రోజు ఆటలో అనేక నాటకీయ పరిణామాల మధ్య సినిమాటిక్ తరహాలో స్కాట్ బోలాండ్ బౌలింగ్‌లో లాంగాన్ దిశగా బౌండరీ బాది సెంచరీ మార్క్ అందుకున్నాడు.

221 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో ఉన్న భారత జట్టును నితీష్ సంచలన బ్యాటింగ్‌తో ఆదుకున్నాడు. వాషింగ్టన్ సుందర్ (160 బంతుల్లో ఒక్క ఫోర్‌తో 50) కలిసి 8వ వికెట్‌కు 127 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. సుందర్, జస్‌ప్రీత్ బుమ్రా ఔటైనా.. సిరాజ్ సాయంతో సెంచరీ మార్క్ అందుకొని తన కలను సాకారం చేసుకున్నాడు. నితీష్ సంచలన శతకంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి టీమిండియా 116 ఓవర్లలో 9 వికెట్లకు 358 పరుగులు చేసింది. క్రీజులో నితీష్ కుమార్ రెడ్డితో పాటు మహమ్మద్ సిరాజ్(0 బ్యాటింగ్) ఉన్నాడు. భారత్ ఇంకా 116 పరుగుల వెనుకంజలో ఉంది. ఆస్ట్రేలియా బౌలర్లలో ప్యాట్ కమిన్స్, స్కాట్ బోలాండ్ మూడేసి వికెట్లు తీయగా.. నాథన్ లయన్ రెండు వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 474 పరుగుల భారీ స్కోర్ చేసిన విషయం తెలిసిందే.

ఈ శతకంతో నితీష్ కుమార్ రెడ్డి అనిల్ కుంబ్లే పేరిట ఉన్న రికార్డ్‌ను అధిగమించాడు. 2008లో అడిలైడ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో అనిల్ కుంబ్లే 8వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగి 87 పరుగులు చేశాడు. ఇప్పటి వరకు ఇదే నెంబర్ 8 బ్యాటర్ హయ్యెస్ట్ స్కోర్‌గా ఉండగా.. నితీష్ అధిగమించాడు.

### నితీష్ కుమార్ రెడ్డికి భారీ నజరానా!

ఆస్ట్రేలియా గడ్డపై సెంచరీ కొట్టిన తెలుగు తేజం, టీమిండియా యువ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డికి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) నజరానా ప్రకటించింది. రూ. 25 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తామని ఏసీఏ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. త్వరలోనే సీఎం చంద్రబాబు నాయుడి చేతుల మీదుగా నగదు పురస్కారం అందజేస్తామని చెప్పారు.

### 45 ఏళ్ల రికార్డ్ సమం..

ఈ మ్యాచ్‌లో నితీష్-సుందర్ 8వ వికెట్‌కు 127 పరుగులు జోడించి 45 ఏళ్ల రికార్డ్‌ను సమం చేశారు. 1979లో వాంఖడే స్టేడియం వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో కర్సన్ గర్వీ-సయ్యద్ కిర్మాణి 8వ వికెట్‌కు 127 పరుగులు జోడించారు.

## డబ్ల్యూటీసీ ఫైనల్..
## 121 పరుగుల దూరంలో దక్షిణాఫ్రికా




*దక్షిణాఫ్రికా, పాకిస్థాన్ మధ్య జరుగుతున్న తొలి టెస్టు నువ్వా నేనా అన్నట్లు సాగుతోంది. ఈ మ్యాచ్లో ఫలితం కోసం భారత్, ఆస్ట్రేలియా, శ్రీలంక ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఎందుకంటే ఇందులో దక్షిణాఫ్రికా గెలిస్తే డబ్ల్యూటీసీ ఫైనల్‌కు దూసుకెళ్తుంది. ఓవర్ నైట్ స్కోరు 88/3తో మూడో రోజు ఆటను కొనసాగించిన పాక్.. మార్కో యాన్సెన్ (6/52) దెబ్బకు 237 పరుగులకే ఆలౌటైంది. ఈ క్రమంలోనే దక్షిణాఫ్రికాకు 148 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. మూడో రోజు ఆట ముగిసే సరికి రెండో ఇన్నింగ్స్‌లో సఫారీలు 3 వికెట్ల నష్టానికి 27 పరుగులు చేశారు. టోనీ డి జోర్జీ (2), రికెల్టెన్ (0, ట్రిస్టన్ స్టబ్స్ (1) ఇలా వచ్చి అలా వెళ్లారు. మహ్మద్ అబ్బాస్ 2, షాజాద్ ఒక వికెట్ పడగొట్టారు. మార్క్రమ్ (22), టెంబా బావుమా (0) క్రీజులో ఉన్నారు. ఇంకా 121 పరుగులు చేస్తే మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా విజయం సాధించడంతోపాటు తొలిసారి ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్‌నకు అర్హత సాధిస్తుంది.*

*పాక్ బ్యాటర్లలో సౌద్ షకీల్ (84: 113 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. బాబర్ అజామ్ (50: 85 బంతుల్లో) రెండేళ్ల తర్వాత టెస్టుల్లో అర్ధ శతకం బాదాడు. సైమ్ అయూబ్(27), షాన్ మసూద్ (28) పరుగులు చేశారు. రబాడ 2, ప్యాటర్సన్, కోర్బిన్ బాష్ చెరో వికెట్ పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో పాకిస్థాన్ 211, దక్షిణాఫ్రికా 301 పరుగులకు ఆలౌటయ్యాయి.*

## విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ విజయం




విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ మళ్లీ గెలుపు బాటపట్టింది. గత రెండు మ్యాచ్‌లో ఓడిన హైదరాబాద్.. శనివారం పుదుచ్చేరితో జరిగిన మ్యాచ్లో 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మిలింద్ (5/13), తనయ్ త్యాగరాజన్ (3/24) విజృంభించడంతో పుదుచ్చేరి 98 పరుగులకే (31.5 ఓవర్లు) కుప్పకూలింది. ఆ జట్టులో సంతోష్ రత్నపార్కే (26), ఆమన్ ఖాన్ (14) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. ఈ స్వల్ప లక్ష్యాన్ని హైదరాబాద్ 6 వికెట్లు కోల్పోయి 20 ఓవర్లలో ఛేదించింది. లక్ష్యఛేదనకు దిగిన హైదరాబాద్‌కు ఆరంభంలోనే వరుస షాక్ లు తగిలాయి. తన్మయ్ అగర్వాల్ (0), పి నితీశ్ రెడ్డి (5), కెప్టెన్ తిలక్ వర్మ (6), కె నితీశ్ రెడ్డి (0) పెవిలియన్‌కు క్యూ కట్టారు. దీంతో హైదరాబాద్ 27 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో కొడిమెల హిమతేజ (42: 61 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), తనయ్ త్యాగరాజన్ (22: 18 బంతుల్లో 4 ఫోర్లు) ఇన్నింగ్స్‌ను చక్కదిద్ది జట్టును విజయం దిశగా నడిపించారు. వరుణ్ గౌడ్ (13) పరుగులు చేశాడు. పుదుచ్చేరి బౌలర్లలో గౌరవ్ యాదవ్ 2, ఫాజిద్ అహ్మద్ 2, విజయ్ రాజా ఒక వికెట్ పడగొట్టారు.

### భరత్, హెబ్బార్ హాఫ్ సెంచరీలు

మరోవైపు, ఈ టోర్నీలో ఆంధ్ర వరుసగా రెండో విజయం సాధించింది. శనివారం సర్వీసెస్తో జరిగిన మ్యాచ్‌లో 10 వికెట్ల తేడాతో సూపర్ విక్టరీ సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సర్వీసెస్.. 36.2 ఓవర్లలో 162 పరుగులకు ఆలౌటైంది. అర్జున్ శర్మ (39), అన్షుల్ గుప్తా (23), వినీత్ ధన్కర్ (23), అరుణ్ కుమార్ (22) పరుగులు చేశారు. ఆంధ్ర బౌలర్లలో తపస్వి (4/28) అదరగొట్టాడు. పృథ్వీ రాజు 2, శశికాంత్ 2, సత్యనారాయణ రాజు, వినయ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు ఆంధ్ర 163 పరుగుల టార్గెట్‌ని 28.4 ఓవర్లలో ఛేదించింది. ఓపెనర్లు శ్రీకర్ భరత్ (86: 90 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్లు), అశ్విన్ హెబ్బార్ (66: 83 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలతో అదరగొట్టారు.

## అదో స్టుపిడ్ షాట్
### పంత్ ఔటయిన తీరుపై గవాస్కర్ వ్యాఖ్య..!



భారత వికెట్ కీపర్ రిషబ్ పంత్ ఆటలో కొత్తదనాన్ని వెతుకుతుంటాడు. ప్రయోగాత్మకమైన షాట్లు ఆడుతాడు. అయితే ఇది మంచిదే అయినప్పటికీ ఎప్పుడు పడితే అప్పుడు ప్రయోగాలు చేస్తే దెబ్బ తింటాడని ఫ్యాన్స్ చెబుతున్నారు. ఆస్ట్రేలియాతో మెల్ బోర్న్ లో జరుగుతున్న మ్యాచ్ లో పంత్ ఔట్ అయిన తీరుపై విమర్శలు వస్తున్నాయి. జట్టు కష్టాల్లో ఉన్న సమయంలో పంత్ అనవసరంగా షాట్ ఆడి వికెట్ పడేసుకున్నాడు. ఓవర్ నైట్ స్కోర్ 164/5 వద్ద మూడో బ్యాటింగ్ దిగిన ఇండియా ఆదిలోనే వికెట్ కోల్పోయింది.

బోలాండ్ బౌలింగ్ లో స్కూప్ షాట్ ఆడడానికి పంత్ ప్రయత్నం చేశాడు. అయితే అది కాస్త క్యాచ్ గా వెళ్లింది. డీప్ థర్డ్ మ్యాన్ పొజిషన్ వద్ద ఉన్న లయన్ క్యాచ్ పట్టడంతో పంత్ వెనుదిరగాల్సి వచ్చింది. భారత్‌కు ఫాలో ఆన్ గండం ఉన్నప్పటికీ పంత్ అలా ఆడడంపై మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ఫైర్ అయ్యారు. జట్టును ఫాలో ఆన్ గండం వెంటాడుతుంటే.. పంత్ ఇష్టమొచ్చినట్లు ఆడతాడా అని గవాస్కర్ ప్రశ్నించారు.

"స్టుపిడ్, స్టుపిడ్, స్టుపిడ్.. ఇది మూర్ఖత్వం కాదు, అంతకుమించి.. మీరు అటువంటి షాట్ ఆడతారని తెలిసి అక్కడ ఇద్దరు ఫీల్డర్లను పెట్టారు. అయినప్పటికీ అలాంటి షాట్ ఆడారంటే మిమ్మల్ని ఏం అనాలో అర్థం కావట్లేదు. జట్టు పరిస్థితులు అర్థం చేసుకోవాలి కదా" అంటూ ఊగిపోయాడు. అప్పటికే ఫైర్ మీద ఉన్న గవాస్కర్ ను హర్షా భోగ్లే మరింత రెచ్చగొట్టే ప్రయత్నం చేసినట్లు కనిపించింది. ఇలా ఆడి ఔట్ అయ్యాకా.. రిషబ్ పంత్ డ్రెస్సింగ్ రూమ్ లోకి వెళ్లొద్దా అని అడగ్గా.. దానికి గవాస్కర్ సమాధానం ఇస్తూ.. ఇండియా వెళ్లకూడదని అని అన్నాడు.



కష్టాల్లో ఉన్న భారత జట్టును నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్ ఆదుకున్నారు. ఇద్దరు కలిసి మంచి భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. హాఫ్ సెంచరీ చేసిన సుందర్ ఔట్ కాగా.. మరో ఎండ్ లో సమయమనంతో ఆడుతున్న నితీష్ కుమార్ రెడ్డి సెంచరీ పూర్తి చేసుకున్నారు. తన కెరీర్ లో మొదటి టెస్ట్ సెంచరీ నమోదు చేశాడు. నితీష్ కుమార్‌పై ఫ్యాన్స్ ప్రశంసలు కురిపిస్తున్నారు. కాగా మూడో రోజు ఆట ముగిసే సమయానికి 9 వికెట్లు కోల్పోయి 358 పరుగులు చేసింది.

బ్లో అప్



దిశాపటానీ

# మహేశ్ మూవీలో బాలీవుడ్ బ్యూటీ



మహేశ్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ చిత్రం రానున్న సంగతి తెలిసిందే. 'ఎస్ఎస్ఎంబి 29'గా ఇది ప్రచారంలో ఉంది. ప్రస్తుతం సినీ ప్రియులంతా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఇదీ ఒకటి. తాజాగా దీనికి సంబంధించిన కొన్ని అప్డేట్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించనున్నట్లు గతంలో వార్తలు జోరుగా ప్రచారమయ్యాయి. ఇప్పుడు మరో నటి పేరు తెరపైకి వచ్చింది.

బాలీవుడ్ టాలెంటెడ్ హీరోయిన్ ప్రియాంక చోప్రా ఈ సినిమాలో నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆమెతో చర్చలు జరిపినట్లు టాక్ వినిపిస్తుంది. ఇందులో హీరోతోపాటు హీరోయిన్ పాత్రకు ప్రాధాన్యం ఉంటుందని ప్రియాంక అయితే ఆ పాత్రకు న్యాయం చేయగలదని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఆమెను తీసుకునే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ప్రియాంక కూడా సినిమాలో నటించేందుకు ఆసక్తిగా ఉన్నారట. పాత్ర కోసం ఇప్పటికే ఆమె ప్రిపరేషన్ కూడా మొదలుపెట్టారట. ఇక ఈ సినిమా షూటింగు సంబంధించిన అప్డేట్ కూడా సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. ఏప్రిల్ నుంచి ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.

ఇక భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకూ చూడని సరికొత్త ప్రపంచాన్ని రాజమౌళి ఆవిష్కరించబోతున్నారని రచయిత విజయేంద్రప్రసాద్ గతంలో ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. దీంతో దీనిపై అంచనాలు రెట్టింపు అవుతున్నాయి. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు విదేశీ నటులు కనిపించనున్నారు. భారతీయ భాషలతో పాటు, విదేశీ భాషల్లోనూ దీనిని అనువదించనున్నారు. దుర్గా ఆర్ట్స్‌పై కె.ఎల్.నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెండితెరపై సరికొత్త లుక్‌లో మహేశ్ కనిపించనున్నారు. ఆ పాత్ర కోసం ఆయన సన్నద్ధమైన విషయం తెలిసిందే. మరోవైపు రాజమౌళి కూడా దీని పనులు ప్రారంభించారు. ప్రస్తుతం లొకేషన్స్ సెర్చ్ చేస్తున్నారు.

# ప్రభాస్.. వెరీ సింపుల్ పర్సన్



తన తదుపరి చిత్రం 'మ్యాక్స్' ప్రమోషన్స్‌లో భాగంగా ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు కన్నడ నటుడు కిచ్చా సుదీప్. స్టార్ హీరోలు ప్రభాస్, విజయ్‌లను ఉద్దేశించి ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ప్రభాస్ మంచి వ్యక్తి. చాలా సింపుల్ పర్సన్. ఎలాంటి హడావుడి లేకుండా జీవనం కొనసాగిస్తుంటారు. సక్సెస్ లేదా ఫెయిల్యూర్ ఏది వచ్చినా ఆయన ఒకేలా ఉంటారు. కొంచెం కూడా గర్వం లేని వ్యక్తి" అని సుదీప్ తెలిపారు. అనంతరం ఆయన కోలీవుడ్ గురించి మాట్లాడారు. "విజయ్ నేను గతంలో కలిసి వర్క్ చేశా. మా కాంబోలో పులి విడుదలైంది. ఆ సమయంలో మేమిద్దరం పలు విషయాల గురించి చర్చించుకునేవాళ్లం. ఆయన ఎన్నో గొప్ప కలలు కంటుంటారు. వాటిని సాధించేందుకు శ్రమిస్తుంటారు. ఏది? ఎప్పుడు? ఎలా? సాధించాలనే విషయాల్లో ఆయన ఎంతో స్పష్టతతో ఉంటారు. ఆయనకు ఉన్నంత క్లారిటీ ఎవరికీ ఉండదు" అని కిచ్చా సుదీప్ తెలిపారు.

కిచ్చా సుదీప్ హీరోగా విజయ్ కార్తికేయ దర్శకత్వం వహించిన చిత్రం 'మ్యాక్స్' శరత్‌కుమార్, సునీల్, శరత్ లోహితస్య కీలక పాత్రల్లో నటించారు. కిచ్చా క్రియేషన్స్ కలిసి వి క్రియేషన్స్ పతాకంపై కలైపులి ఎస్ థాను నిర్మించారు. యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్‌గా ఇది రూపుదిద్దుకుంది. ఎన్నో అంచనాల మధ్య నిర్మితమైన ఈ చిత్రం కన్నడ బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. కిచ్చా సుదీప్ యాక్టింగును సినీ ప్రియులు మెచ్చుకుంటున్నారు. తమ చిత్రానికి ఇంగ్లీష్ టైటిల్ పెట్టడంపై ఇటీవల స్పందించారు.

'ఇందులో చాలా వరకూ పేర్లు ఇంగ్లీష్‌లోనే ఎందుకు ఉన్నాయి? ప్రేక్షకులకు, ఇంటర్వ్యూలు చేసే వారికి నేను కన్నడ నటుడినని తెలుసు. కన్నడలో మాట్లాడుతున్నా. మన కర్ణాటకలో ఇంగ్లిష్ మీడియం స్కూల్స్ ఉన్నాయి. అందులో చదువుకుంటున్న వారు కన్నడిగులు. అసలు మీ సమస్య ఏంటి? ఏ ఫర్ యాపిల్ అని చెబుతారు. యాపిల్‌ను కన్నడలో ఏమంటారో చెప్పండి' అని అసహనం వ్యక్తం చేశారు సుదీప్.

# ప్రీతిజింటాకు షాకింగ్ క్వొశ్చన్?



బాలీవుడ్ నటి ప్రీతి జింటాకు ఊహించని ప్రశ్న ఎదురైంది. సల్మాన్ ఖాన్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఆమె ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. దీనిపై ఓ నెటిజన్ స్పందిస్తూ.. "మీ ఇద్దరూ ఎప్పుడైనా డేట్లో ఉన్నారా?" అని ప్రశ్నించాడు. దీనిపై ఆమె తనదైన శైలిలో బదులిచ్చారు. సల్మాన్ తనకు కుటుంబసభ్యుడితో సమానమని స్పష్టంచేశారు.

"మేమిద్దరం అస్సలు డేట్ చేయలేదు. తను నాకు కుటుంబసభ్యుడితో సమానం. అలాగే నా భర్తకూ అతను మంచి స్నేహితుడు. నా సమాధానంతో మీరు ఆశ్చర్యానికి గురైతే నన్ను క్షమించండి" అని తెలిపారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. నెటిజన్ తీరుపై పలువురు అసహనం వ్యక్తంచేశారు. పెళ్లయిన నటిని ఇలాంటి ప్రశ్నలు వేయడం ఏమాత్రం సరికాదని హితవు పలికారు.

1998లో విడుదలైన 'దిల్ సే'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు ప్రీతి జింటా. ఎన్నో ప్రేమకథా చిత్రాల్లో నటించి సినీప్రియుల మది దోచారు. 'ప్రేమంటే ఇదేరా', 'రాజకుమారుడు' వంటి చిత్రాలతో తెలుగువారికి చేరువయ్యారు. 2018లో విడుదలైన 'భయాజీ సూపర్‌హిట్ తర్వాత ఆమె సినిమాలకు దూరంగా ఉన్నారు. ప్రస్తుతం 'లాహోర్ 1947' కోసం వర్క్ చేస్తున్నారు.

'హర్ దిల్ జో ప్యార్ కరేగా', 'చోరీ చోరీ చుప్కే చుప్కే' వంటి హిందీ చిత్రాలతో ఆన్ స్క్రీన్ జోడీగా మంచి పేరు తెచ్చుకున్నారు ప్రీతి జింటా, సల్మాన్‌ఖాన్. ఆయా చిత్రాలవల్ల వీరిమధ్య మంచి స్నేహం ఏర్పడింది. ఈ క్రమంలోనే సల్మాన్ పుట్టినరోజును పురస్కరించుకొని ప్రతి ఏడాది ఆమె విషెస్ తెలుపుతుంటారు. శుక్రవారం (సల్మాన్ ఖాన్ పుట్టినరోజు డిసెంబర్ 27) కూడా అదేవిధంగా పోస్ట్ పెట్టారు. పలు సందర్భాల్లో ఆయనతో దిగిన ఫొటోలను ఆమె షేర్ చేశారు. "హ్యాపీ బర్త్‌డే సల్మాన్. లవ్ యూ మోస్ట్. మిగిలిన విషయాలు మనం కలిసినప్పుడు చెబుతా. మనం కలిసి ఎన్నో ఫొటోలు దిగాలి. లేదంటే ఆ పాత ఫొటోలనే నేను ప్రతిసారీ పోస్ట్ చేస్తా" అని సరదాగా పెట్టారు. ఈ ఫొటోలు సినీప్రియుల దృష్టిని ఆకర్షించాయి.

# 'క్రిష్-4'పై ఇంట్రెస్టింగ్ అప్‌డేట్



ఇండియన్ సినిమా దగ్గర సూపర్ హీరో జానర్ సినిమాలు ఒకింత తక్కువేనని చెప్పాలి. కానీ ఇప్పుడిప్పుడే మళ్ళీ జానర్‌లో సినిమాలు పెరుగుతూ వస్తున్నాయి. తెలుగు ఆడియెన్స్‌కి ఇప్పుడు మాత్రమే కాదు ఎప్పటినుంచో పరిచయమున్న క్రేజీ సూపర్ హీరో సినిమా ఏదన్నా ఉందీ అంటే అది "క్రిష్" అని చెప్పొచ్చు. ప్రస్తుతమున్న మిడ్ ఏజ్ యువత అంతా ఈ క్రిష్ సినిమా చూసి వచ్చినవారే.. అయితే ఈ సిరీస్‌లో మొత్తం మూడు సినిమాలు రాగా నాలుగో సినిమా కోసం దాదాపు దశాబ్దకాలం నుంచి అభిమానులు ఎదురు చూస్తున్నారు. అయితే ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఓపక్క హృతిక్ తండ్రి, సినిమా దర్శకుడు రాకేష్ రోషన్ సాలిడ్ సబ్జెక్టుని సీక్వెల్ కోసం లాక్ చేసినట్టుగా కూడా టాక్ ఉంది.

అయితే ఇపుడు ఓ ఇంట్రెస్టింగ్ బజ్ ఇపుడు తెలుస్తుంది. ప్రస్తుతం హృతిక్ రోషన్ చేస్తున్న "వార్ 2" తర్వాతే ఈ సినిమాలోకి తాను జాయిన్ కానున్నట్టుగా తెలుస్తుంది. దీంతో ఈ 2025 ప్రథమార్ధంలోనే హృతిక్ తన అవైటెడ్ సూపర్ హీరో సినిమాలో జాయిన్ అవ్వనున్నట్టుగా ఇపుడు టాక్. మరి ఈ క్రేజీ సీక్వెల్‌పై మరింత సమాచారం రావాల్సి ఉంది.

అలియాతో సినిమా చేయాలని

# ప్రతి దర్శకుడికీ ఉంటుంది..



అలియాతో సినిమా చేయాలని దర్శకులంతా కోరుకుంటారని బాలీవుడ్ డైరెక్టర్ వాసన్ బాలా అన్నారు. ఆయన దర్శకత్వంలో అలియా 'జిగ్రా'లో నటించిన సంగతి తెలిసిందే. తాజాగా వాసన్ బాలా ఓ ఇంటర్వ్యూలో ఆమెతో కలిసి పనిచేసిన అనుభవాన్ని పంచుకున్నారు. "ఇండస్ట్రీలో చాలామంది దర్శకులు అలియాతో వర్క్ చేయాలని భావిస్తారు. ఆమె దర్శకుడు చెప్పినట్లు చేస్తుంది. ఎప్పుడూ షాట్‌కు సిద్ధంగా ఉంటుంది. సన్నివేశాలను వివరించాల్సిన అవసరం ఉండదు. సైగలతో సన్నివేశం మొత్తాన్ని అర్థం చేసుకోగలదు. సాధారణంగా షూటింగ్ సమయాల్లో సెట్ అంతా సరదాగా ఉంటుంది. 'జిగ్రా'లో ఫన్నీ సన్నివేశాలు లేకపోవడంతో సెట్ అంతా ఒకరోజు గంభీరంగా ఉంది. అలియా రావడంతో అందరినీ నవ్వుతూ పలకరించి అక్కడి వాతావరణం మొత్తాన్ని మార్చేసింది" అని చెప్పారు.

'జిగ్రా" సినిమా సమయంలో వాసన్ బాలాపై ఎన్నో విమర్శలు వచ్చాయి. యాక్షన్ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద అనుకున్న ఫలితాన్ని అందుకోలేకపోయింది. దీంతో ఇలాంటి స్క్రిప్టును నిర్మాత ఎలా అంగీకరించారనే కామెంట్స్ వినిపించాయి. వాటిపై వాసన్ బాలా స్పందిస్తూ.. "నేను రఫ్‌గా రాసుకున్న స్క్రిప్ట్‌ను కరణ్ జోహర్‌కు పంపాను. ఆయన దాన్ని చూడకుండా అలియాకు పంపించారు. కొంతసేపటికి నేను స్క్రిప్ట్ పంపానని చెప్పడానికి కరణకు కాల్ చేస్తే.. అప్పటికే దాన్ని అలియాకు పంపినట్టు చెప్పారు. తాను ఆ స్క్రిప్ట్‌తో సంతోషంగా లేనని కరణ్ అసహనం వ్యక్తంచేశారు. దానికి ఇంకా మెరుగులు దిద్దాల్సిఉందని అప్పుడే అలియాకు ఎందుకు పంపారని నేను అడగ్గా... రెండు రోజుల్లో కలిసి పూర్తిగా మాట్లాడుకుందామని చెప్పారు. ఆశ్చర్యంగా అలియా ఆ సగం స్క్రిప్ట్ చదివే సినిమాను ఒకే చేశారు" అన్నారు.